

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com

# అక్షర రాజముద్ర

ప్రతి అక్షరం - ప్రజల కోసం | తెలుగు దిన పత్రిక

AKSHARA RAJAAMUDHRA | RNI No: TELTEL/2024/86684

మేడ్చల్-మల్కాజ్‌గిరి | గురువారం | 09.10.2025 | సంపుటి : 2 | సంచిక :246 | పేజీలు : 8 | వెల : 2/-

MEDCHAL-MALKAJGIRI | Thursday | 09.10.2025 | volume : 2 | Issue : 246 | Pages : 8 | Cost : 2/-



విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575


## జాతీయ భద్రతలో కాంగ్రెస్ రాజీ

ముంబై దాడులకు ఎందుకు ప్రతీకారం తీర్చుకోలేదు

ప్రతీకారం తీర్చుకోకుండా అడ్డుకున్నదెవరు

తమకు జాతీయ భద్రతే ముఖ్యమన్న ప్రధాని మోడీ



**2008 ముంబై ఉగ్రవాద దాడుల తర్వాత కాంగ్రెస్ పార్టీ తన 'బలహీనత'ను ప్రదర్శించిందని ప్రధాని మోడీ ఆరోపించారు. నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం మొదటి దశను ఈ రోజు ప్రధాని నరేంద్రమోడీ బుధవారం ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమంలో ఆయన కాంగ్రెస్ హయాంలోని యూపీఏ పాలనపై విమర్శలు గుప్పించారు. అప్పటి రాజకీయ నిర్ణయాలు మరో దేశం నుంచి వచ్చిన ఒత్తిడి ద్వారా ప్రభావితమయ్యాయని ఆరోపించారు.**

ముంబై,అక్టోబర్8(ఆర్ఎన్ఎ):ముంబై దేశంలోని అత్యంత శక్తివంతమైన నగరాల్లో ఒకటి అని, అందుకే ఉగ్రవాదులు 26/11 దాడులకు తెగబడ్డారని అన్నారు. ఇటీవల, కాంగ్రెస్ మాజీ హోం మంత్రి పి. చిదంబరం ముంబై ఉగ్రదాడుల గురిం చి మాట్లాడుతూ.. ప్రపంచ దేశాల ఒత్తిడి వల్ల

- మిగతా 2 లో..







# ముగిసిన పంచాయితీ

అద్లూరికి క్షమాపణలు చెప్పిన మంత్రి పొన్నం

పిసిసి చీఫ్ నివాసంలో ఇరు మంత్రుల భేటీ

కలిసి పనిచేయాలని ఇద్దరికీ మహేశ్ గౌడ్ సూచన

**తెలంగాణ కాంగ్రెస్‌లో ఇటీవల ఏర్పడిన అంతర్గత విభేదాలు సర్దుబాటు అయ్యాయి. తెలంగాణ మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ మధ్య చెలరేగిన వివాదానికి తెరపడింది. టీపీసీసీ మాజీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చొరవ తీసుకుని ఇరు నేతలకు సర్దిచెప్పడం తో సమస్య పరిష్కారమైంది. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు మంత్రి పొన్నం ప్రభాకర్ భేషరతుగా క్షమాపణ తెలిపారు.**

హైదరాబాద్, అక్టోబర్ 8 : మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు వ్యక్తిగతంగా క్షమాపణ లు చెబుతున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ నివాసంలో ఈ మంత్రులిద్ద రూ భేటీ అయ్యారు. టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ నివాసంలో

- మిగతా 2 లో..



06

## భారత్‌తో యుద్ధ ప్రమాదం తొలగిపోలేదు

అలాంటిది వస్తే ఈసారి మాదే పైచేయి

పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్



03

## రెండు దగ్గుమందులపై నిషేధం

ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం

# నేడే నామినేషన్లు

ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు స్వీకరణ

ముగ్గురు పిల్లలుంటే అనర్హులే.. 246 వార్డు స్థానాలకు ఎన్నికల్లేవు

**తెలంగాణలో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు గురువారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. ఉదయం 10.30 గంటల నుంచి అధికారులు నామినేషన్లు స్వీకరించనున్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై హైకోర్టులో విచారణ జరుగుతున్న నేపథ్యంలో ఎన్నికల నోటిఫికేషన్‌ను నిలుపుదల చేస్తూ స్టే ఇవ్వాలని పిటిషనర్ కోరారు.**

హైదరాబాద్: అయితే, పిటిషనర్ విజ్ఞప్తిని హైకోర్టు ధర్మాసనం పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో నేటి నుంచి ఎన్నికల ప్రక్రియ యథావిధిగా కొన సాగనుంది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించిన షెడ్యూలు ప్రకారం

- మిగతా 2 లో..





## స్వదేశీ టెక్నాలజీకి ఆదరణ

జోహో మెయిల్‌కు మారిన కేంద్ర మంత్రులు

ఈ జాబితాలో తాజాగా చేరిన అమిత్ షా

న్యూఢిల్లీ,అక్టోబర్8 : దేశీయ ఉత్పత్తులు, సేవలను వినియోగించాలన్న ప్రధాని నరేంద్రమోదీ పిలుపుతో కేంద్రమంత్రులు సిద్ధం అవుతున్నారు. స్వదేశీ టెక్నాలజీని ప్రోత్సహించేందుకు, డిజిటల్

- మిగతా 2 లో..



## జూబ్లీహిల్ ఎన్నికల్లో కలసికట్టుగా కృషి

పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గెలుపే లక్ష్యం

ప్రభుత్వ వ్యతిరేకతను ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలి

పార్టీ నేతలకు కెటిఆర్ దిశానిర్దేశం

హైదరాబాద్,అక్టోబర్8: జూబ్లీ హిల్స్ ఉపఎన్నికలో కలిసిక ట్టుగా పనిచేసి పార్టీ అభ్యర్థి మాగంటి సునీత విజయానికి కృషి చేయాలని భారత

- మిగతా 2 లో..



## నవీన్ యాదవ్‌కే కాంగ్రెస్ టికెట్

జూబ్లిహిల్స్ ఉప ఎన్నిక అభ్యర్థి ఖరారు

హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు పార్టీ అభ్యర్థిని కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించింది. వి.నవీన్ యాదవ్ పేరును ఏఐసీసీ బుధవారం రాత్రి అధికారికంగా ప్రకటన విడుదల చేసింది. నవంబరు 11న జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి ఉపఎన్నిక జరగనుంది. గత ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి తరఫున పోటీ చేసి గెలిచిన మాగంటి గోపీనాథ్ (62) మృతితో ఈ ఎన్నిక అనివార్యమైంది. నవీన్ యాదవ్ ఆ ఎన్నికల్లో ఎంఐఎం తరఫున పోటీ చేసి ఓడిపోయారు. అనంతరం కాంగ్రెస్‌లో చేరి, తాజాగా టికెట్ దక్కించుకున్నారు.



## పటాకుల తయారీ కేంద్రంలో పేలుడు
## ఆరుగురు దుర్మరణం

పలువురికి గాయాలు..ఆస్పత్రికి తరలింపు

ఘటనపై సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

తక్షణ సహాయక చర్యలకు ఆదేశం

కోనసీమ,అక్టోబర్8 : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. రాయవరంలోని గణపతి గ్రాండ్ బాణసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు సంభవించింది. దీంతో పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. మంటల్లో

- మిగతా 2 లో..

## బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులో వాదనలు

విచారణను నేటికి వాయిదా వేసిన కోర్టు

సమగ్ర కులగణనపై ప్రభుత్వం వాదనలు వినిపించింది

జీవోను రద్దు చేయాలని పిటిషనర్ తరఫు లాయర్ వాదన

ధర్మాసనం తిరస్కరణ -ట్రిపుల్ టెస్ట్ విధానంపై ప్రశ్నలు

గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లు అసెంబ్లీ తీర్మానాలపై విచారణ



హైదరాబాద్, అక్టోబర్ 8 : బీసీ రిజర్వేషన్ బిల్లుపై హైకోర్టులో వాదనలు సాగాయి. ఇరు పక్షాలు తమ వాదనలను ధర్మాసనం ముందు బలంగా వినిపించాయి. ఇప్పటికే స్థానిక ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ అయిన నేపథ్యంలో ప్రభుత్వం జీవో ఇవ్వాల్సిన అవసరం ఏర్పడినట్టు కోర్టుకు తెలిపింది. వాదనలు విన్న ధర్మాసనం తీర్పును నేటికి వాయిదా వేసింది. మధ్యాహ్నం 2.15 గంటలకు విచారణ మళ్లీ ప్రారంభమవుతుందని తెలిపింది. బీసీ రిజర్వేషన్లపై మొత్తం 28 ఇంప్లీడ్ పిటిషన్లు దాఖలయ్యాయి. వీటన్నింటినీ కలిపి హైకోర్టు బుధవారం మధ్యాహ్నం

- మిగతా 2 లో..

## గ్రూప్-1 అభ్యర్థులకు అన్యాయం జరగొద్దు

వారికి నేను అండగా ఉంటా

2లక్షల ఉద్యోగాల హామీని నెరవేర్చండి

గన్‌పార్క్ వద్ద విద్యార్థులకు మద్దతుగా కవిత దీక్ష

హైదరాబాద్,అక్టోబర్8: గ్రూప్-1 అభ్యర్థులకు అండగా ఉంటామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. గన్ పార్కు అమరవీరుల స్తూపం వద్ద గ్రూప్-1 అభ్యర్థులు చేపట్టిన ఆందోళనలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రిలిమ్స్ పరీక్షల నుంచే అవకతవకలు జరుగుతున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ పేరు కోసం బోగస్ ఉద్యోగాలు ఇవ్వొద్దని చెప్పారు. అభ్యర్థులు ఏళ్ల తరబడి



- మిగతా 2 లో..



## జాతీయ భద్రతలో రాజీపడ్డ కాంగ్రెస్

**మొదటి పేజీ తరువాయి**

తాము పాకిస్తాన్‌పై దాడి చేయలేదని చెప్పారు. ముంబై దాడుల తర్వాత మన భద్రతా దళాలు పాకిస్తాన్‌పై దాడి చేయడానికి సిద్ధమయ్యాయయని, కానీ వేరే దేశం ఒత్తిడి కారణంగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం భద్రతా బలగాలను ఆపిందని చిదంబరం అన్నారు. దీనిపై ప్రధాని మోడీ మాట్లాడుతూ.. ఏ దేశం ఒత్తిడి తెచ్చిందో వెల్లడించాలని కాంగ్రెస్‌ను డిమాండ్ చేశారు. ఈ నిర్ణయం కారణంగా భారత్ తీవ్రంగా నష్టపోయిందని ప్రధాని అన్నారు. కాంగ్రెస్ బలహీనత ఉగ్రవాదుల్ని బలపరిచిందని, ప్రాణాలను త్యాగం చేయడం ద్వారా దేశం పదే పదే ఉగ్రవాదానికి మూల్యం చెల్లించాల్సి వచ్చిందని అన్నారు. ఉగ్రదాడి అనంతరం సైనిక చర్యను అడ్డుకుంటూ ఆనాడు నిర్ణయం తీసుకున్నదెవరో చెప్పాలని కాంగ్రెస్‌ను నిలదీశారు. దేశంలో అత్యంత శక్తివంతమైన నగరాల్లో ముంబై ఒకటి కావడంతోనే ఉగ్రవాదులు దానిపై దాడి చేశారన్నారు. నాటి నిర్ణయం ఎవరు తీసుకున్నారో కాంగ్రెస్ చెప్పాలని, దేశ ప్రజలకు ఈ విషయం తెలియాలని అన్నారు. కాంగ్రెస్ చూపించిన బలహీనతే ఉగ్రవాదులకు బలంగా మారిందన్నారు. జాతీయ భద్రత విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజీపడిందని ఆక్షేపించారు. తమ ప్రభుత్వానికి దేశం, దేశ పౌరుల భద్రతే అత్యంత ముఖ్యమని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా ఆపరేషన్ సిందూర్ పేరుతో మిలటరీ యాక్షన్ చేపట్టామని గుర్తు చేశారు. ఉగ్రవాదంపై తమ ప్రభుత్వం నిర్ణయాత్మక చర్యలు తీసుకుంటుందనడానికి ఇదే ఉదాహరణ అని చెప్పారు.మన దేశ భద్రత, పౌరుల భద్రత కన్నా మరేది ముఖ్యం కాదని మోడీ అన్నారు. పహల్గామ్ దాడి తర్వాత ఆపరేషన్ సిందూర్ ప్రస్తావిస్తూ, నేటి భారతదేశం తన శత్రువులను వారి ఇళ్లలోకే వెళ్లి హతమారుస్తోందని ప్రధాని అన్నారు. నవీ ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ 'వికసిత్ భారత్'ను ప్రతిబింబించే ప్రాజెక్ట్ అని ప్రధాని అన్నారు. కొత్త విమానాశ్రయం ద్వారా మహారాష్ట్రలోని రైతుల ఉత్పత్తులు మిడిల్ ఈస్ట్, యూరప్ మార్కెట్లతో అనుసంధానించబడుతాయని చెప్పారు.

## జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కలసికట్టుగా కృషి

**మొదటి పేజీ తరువాయి**

రాష్ట్ర సమితి నేతలకు కేటీఆర్, హరీశ్‌రావు దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని, దాన్ని సమర్థంగా ఉపయోగించుకోవాలన్నారు. ఈమేరకు బుధవారం సమావేశం నిర్వహించారు. మాగంటి సునీత, దివంగత మాగంటి గోపీనాథ్ సోదరుడు వజ్రనాథ్ తదితర పార్టీ నేతలు హాజరయ్యారు. ఎన్నికల బాధ్యతలు అప్పగించిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇన్‌ఛార్జ్లు సమన్వయంతో పనిచేయాలి. ఎవరికి వారు తమకు అప్పగించిన డివిజన్లలో పూర్తిస్థాయిలో బాధ్యతలు నిర్వర్తించాలి. బాకీ కార్డుల ద్వారా విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పాదయాత్రలు నిర్వహించాలి. బూత్ కమిటీలు నిరంతరం ఓటర్లతో సంప్రదింపులు జరపాలి. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి గెలిస్తేనే రాష్ట్ర ప్రభుత్వానికి చెక్ పడుతుందని పేర్కొన్నారు. ప్రచారం చివరి దశలో రోడ్ షోలు నిర్వహించాలని నిర్ణయించారు. పార్టీ అధినేత కేసీఆర్ కూడా ప్రచారానికి రావాలని కొందరు నేతలు ప్రతిపాదించినట్లు సమాచారం. అయితే దీనిపై తదుపరి ఆలోచన చేస్తామని అన్నారు. అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ వాటిని నెరవేర్చడంలో విఫలం అయ్యిందన్నారు.

## కాంగ్రెస్‌లో సమిసిన పంచాయితీ

**మొదటి పేజీ తరువాయి**

ఇరువురు మంత్రుల మధ్య సయోధ్య కుదిరింది. బుధవారం ఉదయం పీసీసీ చీఫ్ నివాసంలో బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌లో అడ్లూరికి పొన్నం క్షమాపణలు చెప్పారు. దీంతో ఇరువురి మధ్య వివాదం ముగిసింది. దీనిపై పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. మంత్రి పొన్నం ప్రభాకర్ చేశారన్న వ్యాఖ్యల పట్ల మరో మంత్రి లక్ష్మణ్ నొచ్చుకోవడంతో యావత్ సమాజం కొంత బాధపడిందన్నారు. మంత్రుల మధ్య జరిగిన సంఘటన కుటుంబ సమస్యగా వెల్లడించారు. జరిగిన సంఘటన పట్ల చింతిస్తూ మంత్రి పొన్నం ప్రభాకర్ క్షమాపణలు చెప్పారన్నారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కష్టపడి పైకొచ్చిన నేతలని తెలిపారు. ఈ సమస్య ఇంతటితో సమసిపోవాలని యావత్ మాదిగ సామాజిక వర్గానికి పీసీసీ చీఫ్ విజ్ఞప్తి చేశారు. ఎక్కడ మాట్లాడినా కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సహచర మంత్రివర్గానికి కూడా విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల పార్టీ అని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ ఆశయాన్ని ఆకాంక్షలను కాంగ్రెస్ పార్టీ ముందుకు తీసుకెళ్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహాయంతో కుల సర్వే పారదర్శకంగా నిర్వహించామన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ మూడు చట్టాలు తీసుకొచ్చామని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. పొన్నం క్షమాపణ కోరడంతో ఈ సమస్య ఇంతటితో సమసిపోయిందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. పొన్నం ప్రభాకర్‌ను గౌరవిస్తా.. కానీ ఆయన వాఖ్యల పట్ల మాదిగ జాతి బాధపడింద న్నారు. అట్టడుగు సామాజిక వర్గాలకు కాంగ్రెస్ అండగా ఉంటుందని తెలిపారు. జెండా మోసిన తనకు మంత్రిగా అవకాశం ఇచ్చారని... పార్టీ లైన్ దాటే వ్యక్తిని కానని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. నేను ఆ మాట అనకపోయినా క్షమాపణలు చెబుతున్నా. పత్రికా కథనాలతో మంత్రి అడ్లూరి మనస్తాపం చెందారు. అందుకే ఆయనకు క్షమాపణలు చెబుతున్నా. మంత్రి అడ్లూరికి, నాకు పార్టీ సంక్షేమం తప్ప మరో ఉద్దేశం లేదు. కాంగ్రెస్ నేతలమంతా సామాజిక న్యాయం కోసం పని చేస్తాం అని తెలిపారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరిగిన ఓ సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్.. మరో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను ఉద్దేశించి అన్నట్లుగా వ్యాఖ్యలు సోషల్‌మీడియా లో రావడం.. వాటిపై లక్ష్మణ్‌కుమార్ ఓ వీడియో విడుదల చేయడం చర్చనీయాంశంగా మారింది. తనపై పొన్నం అనుచిత వ్యాఖ్యలు చేశారని, మారకపోతే జరిగే పరిణామాలకు ఆయనే బాధ్యత వహించాలని అందులో ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఈ ఇద్దరు మంత్రుల మధ్య ఉన్న విభేదాలు.. ఇప్పుడు బహిర్గతమయ్యాయన్న చర్చ జరిగింది. తాజాగా బుధవారం మహేశ్ కుమార్ గౌడ్, ముఖ్య నేతల చొరవతో పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ మధ్య వివాదం ముగిసింది. దీంతో పార్టీలో ఐక్యతను రక్షించేందుకు సంకేతం ఇచ్చారు. పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, అడ్లూరి లక్ష్మణ్ ఇబ్బంది పడ్డారు. అందుకే భేషరతుగా క్షమాపణ చెప్పడం జరిగింది. అన్ని విషయాలు కుటుంబ సంబంధ సమస్యలుగా మాత్రమే ఉన్నాయి. ఇప్పుడు ఈ సమస్యను ఇంతటితో ముగించాలనే కోరుతున్నాను అని స్పష్టం చేశారు. టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలకు అండగా ఉంటుంది. ప్రతి కార్యకర్త, నాయకుడు ఐక్యంగా పని చేయాలని కోరుకుంటున్నాం అని చెప్పారు.

## బిసి రిజర్వేషన్లపై ఇంప్లీడ్ పిటిషన్

### కూనంనేని, ఆర్ కృష్ణయ్య, ఇందిరా శోభన్‌ల దాఖలు

**హైదరాబాద్, అక్టోబర్ 8 :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల వ్యవహారానికి సంబంధించి తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. రిజర్వేషన్ల పెంపు జీవోను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై వాదనలు జరిగాయి. ప్రభుత్వం తరఫున అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. అన్ని పిటిషన్లను కలిపి ఒకేసారి విచారిస్తామని హైకోర్టు స్పష్టం చేసింది. ఇదే విషయమై సుప్రీంకోర్టులో కేసు వివరాలను సీజే అడిగి తెలుసుకున్నారు. రిజర్వేషన్ల అంశాన్ని హైకోర్టులో తేల్చుకోవాలని సుప్రీంకోర్టు పిటిషన్లను డిస్మిస్ చేసిందని ఏజీ గుర్తుచేశారు. ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 9ను సవాలు చేస్తూ బి. మాధవరెడ్డి, సముద్రాల రమేశ్‌లు పిటిషన్ దాఖలు చేసిన విషయం విదితమే. జీవోను సమర్థిస్తూ తమను ప్రతివాదులుగా చేర్చాలంటూ.. సోమ, మంగళవారాల్లో పలువురు ఇంప్లీడ్ పిటిషన్లు దాఖలు చేశారు. మంగళవారం సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎంపీ ఆర్.కృష్ణయ్య, కాంగ్రెస్ నేతలు తదితరులు ఈ పిటిషన్‌లు వేశారు.

# బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులో వాదనలు

**మొదటి పేజీ తరువాయి**

లంచ్ బ్రేక్ తర్వాత విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున అభిషేక్ మను సింఘ్వీ తన వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వాన్ని హైకోర్టు పలు ప్రశ్నలు అడిగింది.

- గవర్నర్ వద్ద బిల్లు ఎప్పటి నుండి పెండింగ్‌లో ఉంది?
- ట్రిపుల్ టెస్ట్ విధానం అమలుచేశారా?
- బీసీ రిజర్వేషన్ల ప్రక్రియ ఎలా జరిగింది?
- కమిషన్ రిపోర్టును పబ్లిష్ చేశారా?
- ప్రజల అభ్యంతరాలను స్వీకరించారా?
- షెడ్యూల్ నోటిఫై అయిందా? అనే అంశాలపై ఏజీని ప్రశ్నించింది.

వాదనలు పూర్తి కాలేదని, విచారణను రేపటికి వాయిదా వేయాలని ఏజీ కోర్టును కోరారు. మరోవైపు, నామినేషన్లు వేయకుండా స్టే ఇవ్వాలని పిటిషనర్లు అభ్యర్థించారు. అయితే హైకోర్టు స్టే ఇవ్వడం నిరాకరించింది. ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జీవో నంబర్ 9ని జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ జీవోను సవాల్ చేస్తూ సముద్రాల రమేశ్, బూతటెంబరి మాధవరెడ్డి పిటిషన్లు దాఖలు చేశారు. జీవోను సమర్థిస్తూ తమను ప్రతివాదులుగా చేర్చాలంటూ సోమ, మంగళవారాల్లో పలువురు ఇంప్లీడ్ పిటిషన్లు దాఖలయ్యాయి. సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎంపీ ఆర్.కృష్ణయ్య, కాంగ్రెస్ నేతలు చరణ్‌కౌశిక్ యాదవ్, ఇందిరా శోభన్ తదితరులు మంగళవారం పిటిషన్లు దాఖలు చేశారు.

### ట్రిపుల్ టెస్ట్ అంశం కీలకం

బీసీ రిజర్వేషన్ బిల్లుపై హైకోర్టు విచారణలో ట్రిపుల్ టెస్ట్ అంశం కీలకంగా మారింది. దీనిని పాటించకుండా రిజర్వేషన్లపై చట్టం చేయలేరని పిటిషనర్ తరఫు లాయర్ వాదించారు. 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని అధికించడమన్నది రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. రాజ్యాంగ బద్ధమైన రిజర్వేషన్ల ప్రకారం 2021 డిసెంబర్‌లో ట్రిపుల్ టెస్ట్ పై మార్గదర్శకాలు ఉన్నాయని గుర్తు చేశారు. బీసీ జనగణన కోసం ప్రత్యేక కమిషన్ సిఫార్సుల మేరకు రిజర్వేషన్ల శాతం నిర్ణయించాలని సుప్రీంకోర్టు మార్గదర్శకాలు ఉన్నాయని పేర్కొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై శాస్త్రీయ ఆధారాలు చూపలేదని, బీసీ కులగణన జరిగినా బహిర్గతం చేయలేదని వాదించారు. బీసీ కులగణన ఆధారంగా 42 శాతం రిజర్వేషన్లు అంటున్నారు. కానీ ఎస్సీ, ఎస్టీలకు మాత్రం 2011 జనాభా ఆధారంగా రిజర్వేషన్లు ఇస్తున్నారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీల జనాభా పెరిగిందా? తగ్గిందా? అన్న లెక్కలు లేవని, అలా అయితే బీసీలకు అధిక రిజర్వేషన్లు ఎలా అంటున్నారు అని ప్రశ్నించారు. 2018లో 34 శాతం బీసీ రిజర్వేషన్లను ఇదే కోర్టు కొట్టివేసిందని పిటిషనర్ తరఫు లాయర్ ప్రస్తావించారు. బీసీ రిజర్వేషన్ల అవసరాన్ని ప్రభుత్వం తరఫున సీనియర్ లాయర్ అభిషేక్ మను సింఘ్వీ వాదించారు. విచారణ అనంతరం మధ్యాహ్నం 2.15 గంటలకు వాదనలు కొనసాగుతాయని సీజే జస్టిస్ ఏకే సింగ్ నేతృత్వంలోని ధర్మాసనం తెలిపింది.




### అన్ని పిటిషన్లను కలిపి విచారణ

స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ గురువారం విడుదలపై స్టే ఇవ్వాలని పిటిషనర్లు కోరారు. అయితే హైకోర్టు పరిగణనలోకి తీసుకోలేదు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 9 జారీ చేసింది. దీన్ని సవాల్ చేస్తూ మాధవరెడ్డి, సముద్రాల రమేశ్ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. బీసీ రిజర్వేషన్లకు అనుకూలంగా ఆర్.కృష్ణయ్య, వి.హనుమంతరావుతో పాటు పలువురు బీసీ నేతలు ఇంప్లీడ్ పిటిషన్లు వేశారు. అన్ని పిటిషన్లను కలిపి సీజే జస్టిస్ ఏకే సింగ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున న్యాయవాది వాదిస్తూ, రిజర్వేషన్లను పెంచుకునే అధికారం ప్రభుత్వానికి ఉన్నా, 50 శాతం మించకూడదని తెలిపారు. విద్య, ఉద్యోగాల్లో 50 శాతం దాటినా, రాజకీయ రిజర్వేషన్లు పెంచరాదని చెప్పారు. ఏజెన్సీల్లో ఎస్టీలకు మాత్రమే రిజర్వేషన్ల సీలింగ్ వర్తించదని తెలిపారు. 42 శాతం రిజర్వేషన్లపై శాస్త్రీయ ఆధారాలు లేవని, బీసీ కులగణన జరిగినా బహిర్గతం కాలేదని చెప్పారు. ఎస్సీ, ఎస్టీలకు 2011 జనాభా ఆధారం అంటున్నారు కానీ బీసీలకు మాత్రం కులగణన ఆధారమంటున్నారు – ఇది రాజ్యాంగ విరుద్ధం అని న్యాయవాది పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభు త్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. బీసీ రిజర్వేషన్ల బిల్లును అన్ని పార్టీలు ఏకగ్రీవంగా ఆమోదించాయని, ఇది రాజకీయాలకు అతీతంగా మద్దతు పొందిందన్నారు. జీవో నంబర్ 9పై స్టే ఇవ్వడం సరికాదని అన్నారు. సమగ్ర కులగణన ఆధారంగా ప్రభుత్వం ముందుకు వెళ్తుందని తెలిపారు. ప్రజాసంక్షేమం కోసం నిర్ణయాలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉందన్నారు. బీసీ ప్రత్యేక కమిషన్ నివేదిక ఆధారంగా రిజర్వేషన్ల శాతాన్ని 50 శాతానికి మించి పెంచవచ్చని చెప్పారు.

"శాసనవ్యవస్థ చేసిన చట్టాన్ని ఎవరూ ప్రశ్నించలేరు. సవరణ చేసినా, చట్టం చేసినా – శాసనవ్యవస్థదే నిర్ణయం. చట్టసభలు చేసిన చట్టాలను కొంతమంది గవర్నర్లు త్రిశంకు స్వర్గంలో ఉంచుతున్నారు. నెలల తరబడి ఏ నిర్ణయం తీసుకోవడం లేదు. బిల్లును ఆమోదించడం లేదు, తిరస్కరించడం లేదు, తిరిగి పంపడం లేదు. తమిళనాడులో ఒక బిల్లు ఏళ్ల తరబడి గవర్నర్ వద్దే ఉంది. ప్రజల ద్వారా ఎన్నికైన సభలు చేసిన చట్టాలను ఆమోదించకపోతే ఎలా? ఆర్టికల్ 200ను గవర్నర్లు దుర్వినియోగం చేస్తున్నారు. వారు నిర్ణయం తీసుకోకపోవడంతో వ్యవస్థ స్తంభించిపోతోంది. బీసీ రిజర్వేషన్ల విషయంలోనూ గవర్నర్ ఇలాగే వ్యవహరించారు. వారి చర్యల వల్లప్రభుత్వాలు ప్రజల ఆకాంక్షలను నెరవేర్చలేకపోతున్నాయి." ఇప్పటికే ఎన్నికల షెడ్యూల్ విడుదలైందని, ఎన్నికల ప్రక్రియలో కోర్టులు జోక్యం చేసుకోకూడదనే తీర్పులు ఉన్నాయని అభిషేక్ సింఘ్వీ వాదించారు. ఈ సమయంలో స్టే ఇవ్వడం సరికాదన్నారు. సమగ్ర అధ్యయనం అనంతరం బీసీ బిల్లు తయారు చేసి జీవో తెచ్చామని చెప్పారు. పూర్తి వాదనలు విన్న తరువాతే జీవో నంబర్ 9పై నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం తరఫున పూర్తి స్థాయి వాదనలు సమర్పిస్తామని కోర్టుకు వివరించారు. దీంతో తదుపరి విచారణను హైకోర్టు గురువారం మధ్యాహ్నానికి వాయిదా వేసింది.

# నేటి నుంచి ఎంపీటీసీ, జడ్పీటీసీ నామినేషన్ల స్వీకరణ?

**మొదటి పేజీ తరువాయి**

తొలుత ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు.. ఆ తర్వాత సర్పంచి, వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఐదు దశల్లో జరిగే ఎన్నికల ప్రక్రియ ఈనెల 9న ప్రారంభమై నవంబరు 11న ముగుస్తుంది. రెండు విడతల్లో జరిగే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు 9న (గురువారం).. మూడు విడతల్లో జరిగే సర్పంచి, వార్డు స్థానాల ఎన్నికలకు 17న నోటిఫికేషన్ విడుదల చేస్తామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ప్రకటించిన విషయం తెలిసిందే.

### అక్కడ ఎన్నికల్లేవు

వివిధ కారణాలతో న్యాయస్థానాలు స్టే విధించిన కారణంగా 14 ఎంపీటీసీ, 27 సర్పంచి, 246 వార్డు స్థానాలకు ఎన్నికలను నిలిపివేసినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది. ఇందులో ములుగు జిల్లా మంగపేట మండలంలోని 14 ఎంపీటీసీ, 25 సర్పంచి, 230 వార్డులుండగా.. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని రెండు సర్పంచి, 16 వార్డు స్థానాలకూ ఎన్నికలు నిర్వహించడం లేదని పేర్కొంది.

### ముగ్గురు పిల్లలుంటే అనర్హులే..

గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల్లో ముగ్గురు పిల్లలుంటే అనర్హత వేటు నిబంధన ఈ ఎన్నికల్లోనూ అమలు కానుంది. దీన్ని సడలించేందుకు పంచాయతీరాజ్‌శాఖ ప్రతిపాదనలు సమర్పించినా.. జనాభా రేటుపై శాస్త్రీయ సమాచారం లేదనే కారణంతో ప్రభుత్వం తొలుత తిరస్కరించింది. ఆ తర్వాత ఇటీవల పునరాలోచన చేసినా... శాసనసభలో చట్టాన్ని సవరించాల్సి ఉన్నందున సమయాభావం కారణంగా జరపలేదు. దీంతో ముగ్గురు పిల్లలున్నవారు ఈ ఎన్నికల్లో పోటీకి అనర్హులని అధికారులు ప్రకటించారు.

## స్వదేశీ టెక్నాలజీకి ఆదరణ

**మొదటి పేజీ తరువాయి**

ఇండియాలో భాగంగా 'జోహో' ప్లాట్‌ఫామ్ వైపు మొగ్గుచూపుతున్నారు. అశ్వినీ వైష్ణవ్, ధర్మేంద్ర ప్రధాన్ ఆ సంస్థ సేవలు వినియోగిస్తుండగా.. కేంద్ర హోంమంత్రి అమిత్ షా జోహో మెయిల్‌లోకి మారిపోయారు. ఈ విషయాన్ని ఆయన ఎక్స్ వేదికగా వెల్లడించారు. హలో.. నేను జోహో మెయిల్‌కు మారాను. నా ఈమెయిల్ చిరునామాలో ఈ మార్పును గమనించండి. నా కొత్త మెయిల్ అడ్రస్ గురించి అమిత్ షా తన పోస్టులో రాసుకొచ్చారు. ఇకనుంచి మెయిల్స్ అన్నీ ఈ కొత్త అడ్రస్‌కే పంపాలని చెప్పారు. భారత్‌పై అమెరికా సుంకాల మోత, జీఎస్టీ సంస్కరణల వేళ ప్రధాని మోదీ 'స్వదేశీ' పిలుపు ఇచ్చిన సంగతి తెలిసిందే. భారత్ బలమైన దేశంగా ఎదుగుతున్న వేళ.. కొన్ని సవాళ్లు తప్పవు. అటువంటి సమయాల్లో 'ఆత్మనిర్భర్' స్ఫూర్తిని కొనసాగించాలి. ఈ నేపథ్యంలో స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించండి అని ఎన్డీయే ఎంపీలకు సూచించారు. ఈ నేపథ్యంలోనే మంత్రులు జోహో సేవలను వినియోగిస్తున్నారు. జీమెయిల్, మైక్రోసాఫ్ట్ ఔట్‌లుక్‌కు పోటీగా జోహో మెయిల్ ను తీసుకువచ్చారు. ఇప్పుడు ఈమెయిల్‌లోకి అమిత్ షా మారగా.. మైక్రోసాఫ్ట్ పవర్‌పాయింట్ బదులు జోహోతోనే కేబినెట్ ప్రజెంటేషన్ తయారు చేసినట్లు అశ్వినీ వైష్ణవ్ వెల్లడించిన సంగతి తెలిసిందే. జోహో రూపొందిన మెసేజింగ్ యాప్ 'అరట్టై'ని వాడాలంటూ ధర్మేంద్ర ప్రదాన్ ఇంతకుముందు పిలుపునిచ్చారు. ప్రస్తుతం అరట్టైకు విశేష ఆదరణ లభిస్తోంది. ఈ యాప్‌ను విపరీతంగా డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. యూజర్ల ప్రైవసీ కోసం త్వరలోనే 'అరట్టై'లోనూ ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్‌ను అందుబాటులోకి తీసుకొస్తామని జోహో సహ వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు తాజాగా వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇందులో సమాచార గోప్యతపై పెద్దఎత్తున చర్చ జరుగుతోన్న సమయంలో ఈ స్పందన వచ్చింది.

## బాణాసంచా తయారీ కేంద్రంలో పేలుడు

**మొదటి పేజీ తరువాయి**

చిక్కుకుని ఆరుగురు సజీవ దహనమయ్యారు. మరికొందరికి తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని అనపర్తి ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మిగిలిన వారిని ప్రైవేటు ఆస్పత్రులకు తరలించారు. పేలుడు సంభవించడంతో పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. మంటల్లో చిక్కుకుని ఆరుగురు సజీవ దహనమయ్యారు. మృతుల్లో నలుగురు మహిళలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. బాణసంచా పరిశ్రమ యజమాని సత్తిబాబు కూడా ఉన్నట్లు సమాచారం. సమాచరం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదం జరిగిన సమయంలో 40 మంది కార్మికులు అందులో పనిచేస్తున్నారు. భారీ పేలుడు ధాటికి బాణసంచా తయారీ కేంద్రం షెడ్డు గోడ కూలింది. శిథిలాల కింద మరికొందరు ఉండొచ్చని సమాచారం. ఘటనాస్థలిని రామచంద్రపురం ఆర్డీవో అఖిల పరిశీలించారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ మహేశ్‌కుమార్ స్పందించారు. వారం క్రితమే బాణసంచా తయారీ కేంద్రాన్ని స్థానిక పోలీసులు, రెవెన్యూ సిబ్బంది పరిశీలించి అన్ని రక్షణ చర్యలు ఉన్నట్లు నిఘ ఇచ్చినట్లు తెలిపారు. అగ్నిప్రమాద నివారణ పరికరాలను గోదాము యజమానులు సక్రమంగా వినియోగించారా? లేదా? అనే విషయాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకుంటు న్నామన్నారు. బాణసంచా పేలుడు ఘటనపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దీనిపై అధికారులతో ఆయన మాట్లాడారు. ప్రమాదంలో పలువురు చనిపోవడంపై సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కారణాలు, ప్రస్తుత పరిస్థితి, సహాయకచర్యలు, వైద్యసాయంపై వివరాలను అధికారుల నుంచి ఆయన తెలుసుకున్నారు. ఘటనాస్థలికి వెళ్లి సహాయకచర్యల్లో పాల్గొనాలని చంద్రబాబు ఆదేశించారు. మరోవైపు ఈ ఘటనపై హోంమంత్రి అనిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జిల్లా ఎస్పీ, అగ్నిమాపక శాఖ అధికారులతో ఆమె మాట్లాడారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని మంత్రి తెలిపారు.



## ఆటో కార్మికులకు అండగా ఉంటాం

- బాకీ కార్డులను పంపిణీ చేసిన మాజీ ఎమ్మెల్యే
- ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపు

**హన్మకొండ,అక్టోబర్8 :** రాష్ట్రంలోని ఆటో కార్మికులకు అండగా ఉంటామని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ భరోసా ఇచ్చారు. ఇచ్చిన హామీలపై కాంగ్రెస్ నాయకులను ఎక్కడ కనపడితే అక్కడ నిలదీయాలి అని పిలుపునిచ్చారు. ప్రత్యేకంగా తయారు చేసిన కాంగ్రెస్ బాకీ కార్డులను మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ ఆటో డ్రైవర్లకు అందజేశారు. హనుమకొండలోని కాజీపేట రైల్వే స్టేషన్ వద్ద ఆటో డ్రైవర్ల యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం రోజున ఈ బాకీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ బాకీ కార్డుతో పాటు, ఆటో కార్మికులకు కాంగ్రెస్ ఎన్నికల హామీలు అమలుకు నోచుకోకపోవడంతో కాంగ్రెస్ ఆటో అన్నలకు బాకీ కార్డును ప్రత్యేకంగా తయారు చేసి ఈ రోజు ఆటో డ్రైవర్లకు అందించడం జరిగింది. గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఫ్రీ బస్సుతో ఆటో కార్మికుల పొట్టకొట్టిందని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులను ఎక్కడపడితే అక్కడ నిలదీయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అమలు గాని హామీలతో గద్దెనెక్కి అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. కేసీఆర్ 14 ఏళ్ల పాటు తెలంగాణ అంతట తిరిగి ప్రజల కష్టసుఖాలను తెలుసుకొని తెలంగాణను సాధించి పదేళ్లపాటు సంక్షేమం, అభివృద్ధితో కూడిన పాలన అందించారని, దేశం మొత్తం కూడా తెలంగాణ వైపు చూసిందని అన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన విధంగా విద్యా,ఉద్యోగ, ఉపాధి రంగాలలో ఎవరు ఊహించని రీతిలో అభివృద్ధి సాధించిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు కాని హామీలతో ఎన్నికల సమయంలో క్యారెంటీ కార్డు అని, ఆరు గ్యారెంటీలు అని, 420 హామీలతో పేరుతో గద్దెనెక్కినదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాల ప్రజలకు అనేక హామీలు ఇచ్చి? ఏ వర్గం ప్రజలను కూడా న్యాయం చేయలేదని అన్నారు. ఏ వర్గాలకైతే కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందో ఆ వర్గం ప్రజలు తిరుగుబాటు చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చినటువంటి హామీలను అమలు చేయాలని అడిగితే బీఆర్ఎస్ పార్టీ నాయకులపై, కార్యకర్తలపై అనేక కేసులు పెడుతూ చిత్రహింసలకు గురి చేస్తుందన్నారు. బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలకు కేసులు కొత్త కాదని, కేసులకు భయపడేది లేదన్నారు. కేంద్రంలో ఉన్నటువంటి బీజేపీ, కాంగ్రెస్ పార్టీతో ములాఖత్ అయి రాష్టాన్ని అన్ని రంగాలలో దెబ్బతీస్తుందన్నారు. గ్యారెంటీలలో ఆటో కార్మికులకు నెలకు రూ.1000, వితంతువులకు రూ. 2500, వికలాంగులకు రూ.6000, విద్యార్థులకు స్కూటీలు ఇస్తానని మభ్యపెట్టి, ప్రభుత్వం వాటిని 22 నెలలు అయినా అమలు చేయలేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికుల బతుకులను చిందర వందర చేసిందని అన్నారు. అనేక మంది ఆటో కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారని, దానికి కాంగ్రెస్ పార్టీ బాధ్యత వహించాలని అన్నారు.

## గ్రూప్-1 అభ్యర్థులకు అండగా ఉంటాం

**మొదటి పేజీ తరువాయి**

ఉద్యోగాల కోసం కష్టపడుతు న్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగుల పేరు చెప్పుకొని అధికారంలోకి వచ్చిందని దుయ్యబట్టారు. రాహుల్ గాంధీ అశోక్ నగర్‌కు వచ్చి ఉద్యోగాలు ఇస్తామని చెప్పారని గుర్తుచేశారు. పారదర్శకంగా పరీక్షలు పెట్టండి. 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు. అధికారంలోకి వచ్చాక పాత ఉద్యోగాలే ఇచ్చారు. ఇవి తప్పుడు పరీక్షలు. కాంగ్రెస్ కోసం వారిని ఎంపిక చేశారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడాలి. మిమ్మల్ని విద్యార్థులు నమ్మారు.. వారి పక్షాన నిలబడండి. మూల్యాంకనం సరిగా జరగాలి. కోర్టుల్లో జడ్జీలకు అర్థం అయ్యేదాకా పోరాటం చేస్తాం. గ్రూప్-1 నియామకాలను రద్దు చేసి.. మళ్లీ పరీక్ష నిర్వహించాలని కవిత డిమాండ్ చేశారు. గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత బుధవారం నిరసనకు దిగారు. నిరుద్యోగులకు మద్దతుగా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. విద్యార్థుల గోస కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో కొంత మందికి ఉద్యోగాలు ఇవ్వడానికి గ్రూప్ 1 పెట్టారా అని ప్రశ్నించారు. తెలిసో తెలియకనో గత పదేళ్లలో గ్రూప్ 1 పెట్టలేదన్నారు. నిరుద్యోగులతో అధికారంలోకి వచ్చి వాళ్ళనే రేవంత్ రెడ్డి మోసం చేస్తున్నారని మండిపడ్డారు. పరీక్ష రాసిన విద్యార్థులు.. ఉద్యోగాలు వచ్చిన విద్యార్థులు రాసిన పేపర్లు బయట పెట్టమని అడుగుతున్నారన్నారు. 50 వేల పాత ఉద్యోగాలు ఇచ్చి తాము ఇచ్చినం అని అంటున్నారని విమర్శించారు. ప్రొఫెసర్ హరగోపాల్‌ను స్వయంగా కలుస్తామని.... వ్యవస్థ ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులలో నిరుద్యోగులను మోసం చేస్తే కుర్చీలో నుంచి తీసి బయట పడేస్తారని హెచ్చరించారు. ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ మీటింగ్ ఉందన్నారు. ప్రజా ఆగ్రహానికి గురికావొద్దని ప్రభుత్వానికి సూచించారు. ఉద్యోగాలు వచ్చిన వారిపై తమకు కోపం లేదని.. అక్రమంగా తెచ్చుకున్న వారిపైనే కోపమని కవిత స్పష్టం చేశారు.

# దీపావళి పండగపై గందరగోళం

## ఈనెల 20నే జరుపుకోవాలంటున్న కాశీ పండితులు



**వారణాసి, అక్టోబర్ 8 :** 'దీపావళి' పండుగ హిందూ మతంలో ప్రత్యేక ప్రాముఖ్యతను కలిగి ఉంది. ఈ దీపాల పండుగ కోసం దేశంలోని ప్రతి ఒక్కరు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే ఈసారి దీపావళి పండగ తేదీ విషయంలో కాస్త గందరగోళం నెలకొంది. కొంతమంది జ్యోతిష్కులు దీపావళి పండగను అక్టోబర్ 20న వస్తుందని చెబుతుండగా.. మరికొందరు అక్టోబర్ 21న జరుపుకుంటారని అంటున్నారు. ఈ నేపథ్యంలో దీపావళి పండగను ఏ రోజున జరుపుకోవాలనే చర్చ మొదలయ్యింది. దేశంలోని ప్రముఖ పండితుల సంస్థ 'కాశీ విద్వత్ పరిషత్' ఈ సంవత్సరం దీపావళిని అక్టోబర్ 20న జరుపుకోవాలని స్పష్టం చేసింది. దీపావళి పండగ తేదీల గందరగోళం నేపథ్యంలో తాజాగా కౌన్సిల్ ఒక ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించింది. సమావేశంలో దీపావళి తేదీపై సుదీర్ఘంగా చర్చించారు. మతపరమైన సూత్రాలు, లేఖనాత్మక లెక్కల ఆధారంగా పూర్తి ప్రదోష కాలం అక్టోబర్ 20న మాత్రమే ఉంటుందని తేల్చారు. అక్టోబర్ 21న అమావాస్య మూడున్నర గంటలకు పైగా ఉండటంతో నక్త ఉపవాసం (లక్ష్మి ఆరాధనలో ముఖ్యమైన భాగం) విచ్ఛిన్నం చేయడానికి ఆ రోజు సమయం ఉండదు. అందువల్ల అక్టోబర్ 20న దీపావళిని జరుపుకోవాలని కౌన్సిల్ ఏకగ్రీవంగా నిర్ణయించింది. కాశీ విద్వత్ పరిషత్ సమావేశం కౌన్సిల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ రామచంద్ర పాండే అధ్యక్షతన ఇటీవల జరిగింది. ఈ సమావేశానికి కాశీ విద్వత్ పరిషత్ జాతీయ ప్రధాన కార్యదర్శి ,బనారస్ హిందూ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ రామనారాయణ ద్వివేది హాజరయ్యారు. ద్రిక్ పంచాంగ్ ప్రకారం? ఈ సంవత్సరం అమావాస్య తిథి అక్టోబర్ 20న మధ్యాహ్నం 3:44 గంటలకు ప్రారంభమై అక్టోబర్ 21న రాత్రి 9:03 గంటలకు ముగుస్తుంది. దీపావళి నాడు లక్ష్మి, గణేశులను పూజించడానికి అత్యంత పవిత్రమైన సమయం సాయంత్రం 7:08 నుంచి 8:18 వరకు ఉంటుంది. ప్రదోష కాలం, స్థిరమైన లగ్నంతో సమానంగా ఉండే ఈ సమయం లక్ష్మీదేవి అండ్ గణేశుడి ఆశీస్సులు పొందడానికి అనువైనదిగా పరిగణించబడుతుంది.

## 12న పల్స్ పోలియో స్పెషల్ డ్రైవ్

### ఐదు జిల్లాలను ఎంపిక చేసిన కేంద్రం



**హైదరాబాద్, అక్టోబర్ 8 :** ఈ నెల 12వ తేదీన రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో పల్స్ పోలియో వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నారు. మన రాష్ట్రంలో పోలియో చివరి కేసు 2007లో నమోదు అయింది. మన దేశంలో 2011లో చివరి కేసు నమోదు అయింది. గత 3 సంవత్సరాలుగా బంగ్లాదేశ్, పాకిస్తాన్ తదితర దేశాల్లో పోలియో కేసులు నమోదు అవుతున్నాయని కేంద్ర వైద్యారోగ్య శాఖ పేర్కొంది. ఈ నేపథ్యంలో.. ఆయా దేశాల నుంచి రాకపోకలు జరుగుతున్న దేశంలోని పలు జిల్లాల్లో పోలియో వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని కేంద్ర ఆరోగ్యశాఖ నిర్ణయించింది. ఇందుకోసం దేశవ్యాప్తంగా 290 జిల్లాలను ఎంపిక చేయగా, అందులో మన రాష్ట్రం నుంచి 5 జిల్లాలు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, హన్మకొండ ఉన్నాయి. ఈ ఐదు జిల్లాలతోపాటు వరంగల్ జిల్లా పరిధిలోని పట్టణ ప్రాంతంలోనూ వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ నిర్ణయించింది. ఈ 5 జిల్లాల పరిధిలో 0-5 సంవత్సరాల వయసు పిల్లలు 17,56,789 మంది ఉన్నట్టు అధికారులు అంచనా వేశారు. వీరందరికీ ఈ నెల 12న స్పెషల్ డ్రైవ్‌లో పోలియో వ్యాక్సిన్ వేయనున్నారు. అప్పుడే పుట్టిన శిశువుల దగ్గర్నుంచి, 5 సంవత్సరాల వయసున్న పిల్లలందరికీ వ్యాక్సిన్లు వేయించాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.



## మా ఓపికను పరీక్షించవద్దు

### పిటిషన్లపై హైకోర్టు అసహనం

**హైదరాబాద్, అక్టోబర్ 8 :** పిటిషనర్లను ఉద్దేశించి తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఇదే చివరి విచారణ కాదని.. అన్ని అంశాలనూ ప్రస్తావించొద్దని సూచించింది. తమ ఓపికను పరీక్షించకండంటూ పిటిషనర్లను ఉద్దేశించి సున్నితంగా హెచ్చరించింది. గంటలకొద్దీ ఒకే అంశం ప్రస్తావించి, తమ సమయాన్ని వృథా చేయొద్దని చెప్పింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫు లాయర్ అభిషేక్ మను సింఘ్వీ తన వాదనలు వినిపించారు. బీసీ రిజర్వేషన్ల పై అన్ని రాజకీయ పార్టీలు అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదించాయని చెప్పారు. జీఓ పై స్టే ఇవ్వాలని కోరడం సరైంది కాదని అన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని రిజర్వేషన్లు పెంచుకునే అవకాశం ప్రభుత్వానికి ఉందని చెప్పారు. పిటిషనర్ లాయర్లు ఇన్నిగంటలు వాదనలు వినిపిస్తే.. మాకు అవకాశం వస్తుందా.. అంటూ ప్రశ్నించారు. కులగణన లెక్కలు ఫోర్జరీ అనుకుంటున్నారా.. వాస్తవాలు తెలియకుండా పిటిషనర్లు ఎలా మాట్లాడుతారని అన్నారు. లంగాణలో బీసీ రిజర్వేషన్ల పెంపుపై హైకోర్టులో బుధవారం కీలక విచారణ సాగింది. బీసీల్లో వర్గాల వారీగా రిజర్వేషన్ల కేటాయింపు జరగలేదని పలు పిటిషన్లు దాఖలైన నేపథ్యంలో, విచారణ వాడివేడిగా కొనసాగింది. ఈ సందర్భంగా పిటిషనర్ల తరఫున లాయర్ సుదర్శన్ వాదనలు వినిపించారు. అయితే, నిరంతరం అదే అంశాలను పునరావృతం చేస్తూ కోర్టు సమయాన్ని వృథా చేయొద్దని హైకోర్టు హెచ్చరించింది. ఇది చివరి విచారణ కాదు. అన్ని అంశాలను ఒకేసారి ప్రస్తావించవద్దు. మా ఓపికను పరీక్షించకండని కోర్టు స్పష్టం చేసింది.

## రెండు దగ్గుమందులపై నిషేధం

### ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం



**హైదరాబాద్, అక్టోబర్ 8 :** రెండు దగ్గు మందులను నిషేధిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రీలైఫ్, రెస్పిఫ్రెష్ - టీ ఆర్ నం విక్రయించొద్దంటూ అందులో పేర్కొంది. ఈ రెండు దగ్గు మందుల్లోనూ కల్తీ జరిగినట్లు గుర్తించారు. వీటిని గుజరాత్‌కు చెందిన ఫార్మా కంపెనీల ఔషధాలుగా పేర్కొన్నారు. ఇటీవల మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో 'కోల్డ్‌రిఫ్' అనే దగ్గు మందు వాడడం వల్ల పలువురు చిన్నారులు మృత్యువాత పడ్డట్లు ఆరోపణలు వచ్చాయి. దీనిపై దర్యాప్తు జరుగుతోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇప్పటికే 'కోల్డ్ రిఫ్'ను పూర్తిగా నిషేధిస్తున్నట్టు ఔషధ నియంత్రణ విభాగం డీసీఏ ప్రకటించింది. చిన్నారులలో తీవ్రమైన రోగాల్ని, మరణాలను కలిగిస్తున్న ప్రమాదకర దగ్గు మందులను రాష్ట్ర ప్రభుత్వం నిషేధిస్తూ చర్య తీసుకుంది. రీలైఫ్, రెస్పిఫ్రెష్-టీఆర్ అనే రెండు సిరప్‌లను విక్రయించరాదు అని తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా ఆదేశాలు జారీ చేసింది. ఈ నిర్ణయం పిల్లల భద్రతను ముఖ్యంగా పరిగణించి తీసుకోవడం విశేషం. మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో కోల్డ్‌రిఫ్ సిరప్ కారణంగా 16 చిన్నారుల మరణాలు చోటు చేసుకున్న ఘటనల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. డాక్టర్ల పర్యవేక్షణ లేకుండా ఎడపెడా పిల్లలకు దగ్గు, జలుబు సిరప్‌లు ఇవ్వకూడదని అధికారిక సూచనలు కూడా జారీ అయ్యాయి. కాంచీపురంలో తయారు చేసిన కోల్డ్‌రిఫ్ సిరప్‌పై ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ తనిఖీలు నిర్వహించింది. ఈ సిరప్‌ను తక్షణం తెలంగాణలో విక్రయించరాదని ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్రంలోని అన్ని హాస్పిటళ్లు, ఫార్మసీలు ఈ నిషేధాన్ని వెంటనే అమలు చేయాల్సినట్లు సూచించబడింది.

## బీసీ రిజర్వేషన్లపై తీవ్ర ఉత్కంఠ

### నేటి తీర్పు ఎలా ఉంటుందో అన్న టెన్షన్

**హైదరాబాద్, అక్టోబర్ 8 :** బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులో బుధవారం విచారణ వాయిదా పడింది. అయితే విచారణ ప్రారంభమైన కాసేపటికే వాయిదా వేస్తూ ధర్మాసనం ప్రకటించింది. మధ్యాహ్నం 12.30 గంటలకు వాయిదా వేసింది హైకోర్టు. తొలుత విచారణ ప్రారంభమవగానే.. రిజర్వేషన్లపై ప్రస్తుత పరిస్థితి ఏంటని ప్రశ్నించింది హైకోర్టు. సుప్రీంకోర్టులో జరిగిన విచారణపైనా హైకోర్టు ధర్మాసనం ఆరా తీసింది. అన్ని పిటిషన్లను కలిపి ఒకేసారి విచారిస్తామని పేర్కొన్న ధర్మాసనం.. విచారణను మధ్యాహ్నానికి వాయిదా వేసింది. కాగా, బీసీ రిజర్వేషన్లపై 28 ఇంప్లీడ్ పిటిషన్లు దాఖలయ్యాయి. అన్ని పిటిషన్లను కలిపి మధ్యాహ్నం హైకోర్టు విచారించింది. ప్రభుత్వం తరఫున అభిషేక్ సింఘ్వీ కోర్టులో వాదనలు వినిపించారు. కాగా, బీసీ రిజర్వేషన్లపై అంశంపై తెలంగాణ హైకోర్టు తీర్పు ఎలా ఉంటుందో అని తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ తీర్పు స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం చూపనుంది. హైకోర్టు నిర్ణయంతో స్థానిక సంస్థల ఎన్నికల భవితవ్యం తేలనుంది. సుప్రీంకోర్టు గత తీర్పుల ప్రకారం.. రిజర్వేషన్లు 50 శాతం మించడానికి అవకాశం లేదు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన జీవో ప్రకారం రిజర్వేషన్లు 67 శాతానికి పెరిగాయి. బీసీలకు 42 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 25 శాతం రిజర్వేషన్లు కల్పించింది ప్రభుత్వం. హైకోర్టు ఒకవేళ ఈ జీవోను కొట్టివేస్తే స్థానిక సంస్థల ఎన్నికలకు బ్రేక్ పడే అవకాశం ఉంది.


## ఫీజు రియంబర్స్‌మెంట్‌పై ప్రభుత్వం హామీ

### దీపావళి వరకు బంద్ వాయిదా వేసిన విద్యాసంస్థలు

**హైదరాబాద్, అక్టోబర్ 8 :** ఉన్నత విద్యా సంస్థల సమాఖ్య ప్రభుత్వం ఇచ్చిన హామీతో సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేసుకుంది. ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిని సమాఖ్య ప్రతినిధులు కలసి తమ సమస్యలను వివరించారు. అనంతరం వారు సమావేశమై నిర్ణయాలు తీసుకున్నారు. ప్రభుత్వం దీపావళి లోపల రూ.300 కోట్ల బకాయిలను విడుదల చేస్తామని హామీ ఇచ్చింది. దీంతో అక్టోబర్ 13వ తేదీ నుంచి ప్రారంభం కావాల్సిన సమ్మెను, కళాశాలల బంద్ కార్యక్రమాన్ని అక్టోబర్ 23వ తేదీ వరకు (దీపావళి మరుసటి రోజు వరకు) వాయిదా వేయాలని నిర్ణయించారు. అయితే, దీపావళి నాటికి బకాయిలు విడుదల కాకపోతే.. అక్టోబర్ 23న మళ్లీ జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించి తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని సమాఖ్య స్పష్టం చేసింది. ఇక, దసరా ముందు విడుదల చేసిన రూ.200 కోట్ల బకాయిల్లో సుమారు 70 మైనారిటీ, జనరల్ కళాశాలలకు ఒక్క రూపాయి కూడా అందలేదని సమాఖ్య పేర్కొంది. ప్రభుత్వం వెంటనే నిధుల విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

## హైకోర్టులో ప్రభుత్వం బలమైన వాదనలు

### కేసు ఖచ్చితంగా గెలుస్తామని మహేశ్ గౌడ్ ధీమా



**హైదరాబాద్, అక్టోబర్ 8 :** తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల అంశంపై హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాదులు బలమైన వాదనలు వినిపించారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులో విచారణ నేటికి వాయిదా పడిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారమే నామినేషన్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. గురువారం ఉదయం నుంచి జడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. బీసీ రిజర్వేషన్ల కేసు కచ్చితంగా గెలుస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు. దాదాపు 90 ఏళ్ల తర్వాత రాష్ట్రంలో కుల సర్వే జరిగిందని, బీసీల నోటి ముద్దను భాజపా లాగే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. బీసీల బిల్లుకు అసెంబ్లీలో అన్ని పార్టీలు మద్దతు ఇచ్చాయని గుర్తుచేశారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 90 శాతం స్థానాలు గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

## జస్టిస్ గవాయ్‌పై దాడికి నిరసన

### ప్లకార్డులతో నిరసన తెలిపిన ఉద్యోగులు

**హైదరాబాద్, అక్టోబర్ 8 :** భారత ప్రధాన న్యాయమూర్తి బిఆర్. గవాయిపై జరిగిన దాడికి నిరసనగా తెలంగాణ సచివాలయంలో ఆగ్రహావేశం వ్యక్తమైంది. సెక్రటేరియట్ ఉద్యోగుల సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగులు చేతుల్లో ప్లకార్డులు పట్టుకుని జస్టిస్ గవాయి జిందాబాద్‘, దళితులపై దాడులు ఆపాలి, న్యాయవ్యవస్థ గౌరవాన్ని కాపాడాలి అంటూ నినాదాలు చేశారు. సి.జె.ఐ. బిఆర్. గవాయి పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ, ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా ప్రభుత్వం, చట్ట వ్యవస్థ కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సెక్రటేరియట్ ఉద్యోగుల సంఘం నేతలు మాట్లాడుతూ .. బిఆర్. గవాయి దేశ అత్యున్నత న్యాయస్థానానికి చెందిన రెండవ దళిత ప్రధాన న్యాయమూర్తి. ఆయనపై దాడి జరగడం అంటే న్యాయవ్యవస్థ, సామాజిక సమానత్వం మీద దాడి చేసినట్లే. ఇది ప్రజాస్వామ్యానికి పెద్ద మచ్చ అని పేర్కొన్నారు. నిరసనలో పాల్గొన్న ఉద్యోగులు బి.ఆర్. గవాయికి సంఘీభావం వ్యక్తం చేస్తూ, ఆయనకు పూర్తి భద్రత కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

## జూబ్లీహిల్స్ బరిలో దించండి

### బిజెపిని కోరిన మాధవీలత



**హైదరాబాద్, అక్టోబర్ 8 :** జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికల షెడ్యూల్ విడుదల అవ్వడంతో రాష్ట్ర రాజధానిలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ప్రముఖ రాజకీయ పార్టీలు నేతలు జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానంలో ఎవరిని బరిలోకి దించాలా అని చర్చలు చేపడుతున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ బీజేపీ నేత మాధవీలత జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలు సంబంధించి రంగంలోకి దిగారు. బీజేపీ అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలని అధిష్ఠానాన్ని కోరినట్లు తెలిపారు. ఇందుకోసం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ డా. లక్ష్మణ్‌ను కలిసినాట్లు ఆమె తెలిపారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసే అవకాశం ఇవ్వాలని బీజేపీ పెద్దలను కలిసి విజ్ఞప్తి చేస్తున్నానని.. ఈ ఉప ఎన్నికలు పార్టీకి చాలా ముఖ్యమైనవని అన్నారు. ప్రజలకు బీజేపీ పట్ల నమ్మకం, ప్రేమ, అభిమానం విపరీతంగా ఉందని మాధవీలత తెలిపారు. తెలంగాణ ప్రజలకు బీఆర్ ఎస్, కాంగ్రెస్ పార్టీల పాలనల వల్ల నష్టం జరిగిందని.. ఇప్పుడు ప్రజలు మార్పు కోరుకుంటున్నారని అన్నారు. అధిష్ఠానం పరిశీలిస్తున్న అభ్యర్థుల జాబితాలో తన పేరూ ఉందని తెలిసింది. అవకాశం ఇస్తే ఎన్నికల యుద్ధానికి సిద్ధంగా ఉంటానని ఆమె స్పష్టం చేశారు. అదేవిధంగా.. అవకాశం రాకపోయినా, ఒక పోలింగ్ బూత్ బాధ్యతలు ఇచ్చినా సంతోషంగా స్వీకరిస్తాను. గెలుపు కోసం కృషి చేస్తాను. ఢిల్లీ, వారణాసి, ఝార్ఖండ్, మహారాష్ట్ర వంటి పలు రాష్ట్రాల్లో బీజేపీ గెలుపు కోసం పనిచేశానని తెలిపారు. తన రాజకీయ ప్రయాణం బీజేపీ పెద్దల ఆశీర్వాదం, అభిమానంతోనే కొనసాగుతోందని మాధవీ లత పేర్కొన్నారు. గత 18 నెలలుగా పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తున్నానని ఆమె అన్నారు.

## ఆర్టీసీని విధ్వంసం చేసిన వారే మొసలి కన్నీరు

- ఛలో బస్ భవన్ పేరుతో రాజకీయ కుట్రలు
- బిఆర్ఎస్ తీరుపై మండిపడ్డ మంత్రి పొన్నం



**హైదరాబాద్, అక్టోబర్ 8 :** బీఆర్ఎస్ పార్టీ చేపట్టబోతున్న ఛలో బస్ భవన్ కార్యక్రమంపై మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఛలో బస్ భవన్ చేపట్టేవారు ఆత్మ పరిశీలన చేసుకోవాలని సూచించారు. ఛలో బస్ భవన్‌తో అనవసరమైన రాజకీయ కుట్రకు తెరలేపుతున్నారని ఆరోపించారు. ఆర్టీసీ కార్మికులపై కేసులు పెట్టిన వాళ్లు ఈ రోజు మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. గతంలో ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తే మాజీ సీఎం కేసీఆర్ కనీసం పట్టించుకోలేదని గుర్తు చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం గాంధీ భవన్‌లో మాట్లాడారు.. ఆర్టీసీపై బీఆర్ఎస్ నేతలు రాజకీయం చేస్తున్నారని పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఆర్టీసీలో అనేక సంస్కరణలు తీసుకువచ్చామని తెలిపారు. ఆర్టీసీ పరిరక్షణ, కార్మికుల సంక్షేమం, ప్రయాణికుల సంరక్షణకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ధీమా వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ బకాయిలను తాము కడుతున్నామని చెప్పుకొచ్చారు. కేసీఆర్ ప్రభుత్వం గుడిని, గుడి లింగాన్ని మింగినట్టు ఆర్టీసీని పూర్తిగా ధ్వంసం చేసిందని విమర్శించారు. తమ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా ఛార్జీలు పెంచలేదని స్పష్టం చేశారు. ఆర్టీసీ పరిరక్షణ కోసం కొంత ఛార్జీలు పెంచామని పేర్కొన్నారు. ఆర్టీసీకి లాభాలు వచ్చే విధంగా కార్యాచరణ తీసుకుంటున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం సిటీ బస్సుల్లో పెంచిన ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ.. రేపు(గురువారం) బీఆర్ఎస్ పార్టీ ఛలో బస్ భవన్‌కు పిలుపునిచ్చింది.

## దగ్గుమందు తయారీ సంస్థపై ఉదాసీనత

### తమిళనాడు తీరుపై కేంద్రం ఆగ్రహం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 8 :** దగ్గు మందు వివాదం నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై కేంద్ర ఆరోగ్య శాఖ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. 'కోల్డ్‌రిఫ్' దగ్గు మందు వల్ల మధ్యప్రదేశ్‌లో చాలా మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ దగ్గుమందును తమిళనాడులోని కాంచీపురానికి చెందిన శ్రేసన్ ఫార్మా యూనిట్ తయారు చేసింది. ఈ నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై కేంద్ర ఆరోగ్య శాఖ వర్గాలు స్పందించాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిందించుకునే సమయం కాదని.. జవాబుదారీతనం అవసరమని ఆరోగ్య శాఖ వర్గాలు పేర్కొన్నట్లు సమాచారం. కేంద్రం నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ.. తమిళనాడు ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ చర్యలు తీసుకోవడంలో విఫలమైందని పేర్కొన్నట్లు తెలుస్తోంది. డీసీజీఐ స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ లైసెన్స్ ఎందుకు రద్దు చేయలేదని తమిళనాడు ప్రభుత్వాన్ని కేంద్ర ఆరోగ్య శాఖ ప్రశ్నించినట్లు సమాచారం.

## బస్ ఛార్జీల పెంపునకు నిరసన

### నేడు బిఆర్ఎస్ చలో బస్ భవన్

**హైదరాబాద్, అక్టోబర్ 8 :** నగరంలో బస్ ఛార్జీల పెంపును నిరసిస్తూ..ఛలో బస్ భవన్‌కు బీఆర్ఎస్ పార్టీ పిలుపునిచ్చింది. ఈ మేరకు గురువారం బస్ భవన్ దగ్గర బీఆర్ఎస్ నేతలు నిరసన చేపట్టనున్నారు. సిటీలో ఆర్టీసీ ఛార్జీల పెంపును ఖండిస్తూ.. బీఆర్ఎస్ ఆందోళనకు దిగనుంది. ఈ నేపథ్యంలో మెహిదీపట్నం నుంచి బస్ భవన్ వరకు ఆర్టీసీ బస్సులో మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు, ఇతర నేతలు ప్రయాణం చేయనున్నారు. బస్ భవన్‌కు చేరుకుని ఆర్టీసీ ఎండీకి ఛార్జీల పెంపుపై మెమోరాండం ఇవ్వనున్నారు. ఈ మేరకు బస్ భవన్ ముందు ధర్నా చేపట్టి సిటీ బస్సుల్లో పెంచిన ఛార్జీలు తగ్గించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేయనుంది. కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలో నడిచే అన్ని బస్సుల్లో ఛార్జీలు పెంచిన విషయం తెలిసిందే. సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఈ-ఆర్డినరీ, ఈ-ఎక్స్‌ప్రెస్, మెట్రో డీలక్స్, ఈ-మెట్రో, ఏసీ సర్వీసుల్లో ఛార్జీలు పెంచింది. ఈ మేరకు మొదటి మూడు స్టేజిలకు రూ.5, 4వ స్టేజి నుంచి రూ.10 అదనపు ఛార్జీలు వసూలు చేస్తోంది. మెట్రో డీలక్స్, ఈ-మెట్రో ఏసీ సర్వీసుల్లో మొదటి స్టేజీకి రూ.5, రెండో స్టేజీ నుంచి రూ.10 అదనపు ఛార్జీలు తీసుకుంటుంది. ఈ నేపథ్యంలో పెంచిన బస్సు ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ.. బీఆర్ఎస్ పార్టీ ఛలో బస్ భవన్‌కు పిలుపునిచ్చింది.

## స్టాక్ మార్కెట్లో నష్టాలతో యువకుడి ఆత్మహత్య

**హైదరాబాద్, అక్టోబర్ 8 :** బెట్టింగ్ యాప్‌లతోపాటు స్టాక్ మార్కెట్లో పెట్టుబడి పెట్టి తీవ్ర నష్టాల్ని చవిచూసిన యువకుడు ఆత్మహత్య చేసుకున్నారు. ఓయో రూమ్ అద్దెకు తీసుకొని సూసైడ్ చేసుకున్నాడు. ఈ ఘటన హైదరాబాద్ లో జరిగింది. కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని జై జవాన్ కాలనీకి చెందిన మన్నె నరేందర్ తండ్రి చనిపోగా.. తల్లి జగదాంబతో కలిసి జీవిస్తున్నాడు. నరేందర్ గతంలో ఓ షాపింగ్ మాల్‌లో సేల్స్‌మెన్‌గా పని చేశాడు. స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడి పెట్టి నష్టపోయాడు. షేర్ మార్కెట్ పరుగులు తీసినంతకాలం లాభాలు ఆర్జించాడు. ఆ తర్వాత ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయాడు. మరోవైపు బెట్టింగ్ యాప్స్‌లో కూడా పెట్టుబడి పెట్టాడు. లాభాలు ఎక్కువగా వస్తాయని నమ్మాడు. కానీ తీవ్ర నష్టాలు వచ్చాయి. ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై ఈసీఎల్ కమలానగర్‌లోని ఆర్ స్క్వేర్ ఓయో రూంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

## నాటుబాంబు పేలి రైతుకు తీవ్ర గాయాలు

**ములుగు, అక్టోబర్ 8 :** ములుగు జిల్లాలోని జగ్గన్నపేట గ్రామ సమీపంలో ఘోరం జరిగింది. ఓ రైతు తన పొలంలో గడ్డి మందు పిచికారీ చేస్తుండగా, ఒక్కసారిగా నాటుబాంబు పేలింది. దీంతో రైతుకు తీవ్ర గాయాలయ్యాయి. రైతు కాలు నుజ్జునుజ్జు అయింది. అప్రమత్తమైన కుటుంబ సభ్యులు బాధిత రైతును హుటాహుటిన చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. బాధిత రైతు మదనపల్లి గ్రామానికి చెందిన కుంటమల్ల సాంబయ్యగా పోలీసులు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# పాక్ నయవంచక విధానాలు!



**ఆపరేషన్ సిందూర్ ద్వారా చావుదెబ్బతిన్న పాకిస్థాన్...కాల్పుల విరమణ ఒప్పందాన్ని తెరపైకి తెచ్చి, మరింత నష్టం జరక్కుండా చూసుకుంది. లేకుంటే భారత్ చేతిలో చావుదెబ్బ తినివుండేది. కానీ ఇప్పడా విషయం మరచిపోయింది. మళ్లీ యుద్ధ ప్రేలాపనలు పేలుతోంది. ఆపరేషన్ సిందూర్‌తో భారత్ దెబ్బను రుచి చూసినా.. పాకిస్థాన్ ప్రగల్బాలు మాత్రం ఆపట్లేదు. తాజాగా ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మాటలే ఇందుకు నిదర్శనం. భారత్‌తో మళ్లీ యుద్ధం జరిగే అవకాశాలను తోసిపుచ్చలేమన్నారు. అయితే, ఈసారి యుద్ధం వస్తే తాము అనుకూల ఫలితాలు సాధిస్తామంటూ బీరాలు పలికారు. నేను ఉద్రిక్తతలను కోరుకోవట్లేదు. కానీ, ముప్ప పొంచి ఉన్నమాట వాస్తవం. భారత్‌తో యుద్ధం అవకాశాలను కొట్టిపారేయ లేం. కానీ, ఈసారి యుద్ధం జరిగితే.. గతంలో కన్నా మెరుగైన ఫలితాలు సాధిస్తాం అంటూ రెచ్చగొట్టేలా మాట్లాడారు.**

సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోన్న పాక్‌కు ఇటీవల భారత్ ఆర్మీ చీఫ్ గట్టి వార్నింగ్ ఇచ్చిన సంగతి తెలిసిందే. దానికి బదులిస్తూనే ఖవాజా ఈ విధంగా కవ్వింపులకు పాల్పడ్డారు. ఇటీవల భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది మాట్లాడుతూ.. భారత్ పూర్తి సన్నద్ధంగా ఉంది. ఆపరేషన్ సిందూర్ 1.0లో మాదిరిగా ఈసారి సహనం ప్రదర్శించబోం. పాక్ ప్రపంచపటంలో ఉండాలనుకుంటే సీమాంతర ఉగ్రవాదాన్ని ఆపి తీరాల్సిందే. లేదంటే ఆ దేశాన్ని చరిత్ర నుంచి తుడిచిపెట్టాల్సి వస్తుంది జాగ్రత్త అని జనరల్ ద్వివేది గట్టిగా హెచ్చరించారు. అయితే వీటిని ఓ హెచ్చరికగా తీసుకుని జాగ్రత్తగా ఉండాల్సిన పాక్ నేతలు తరచూ మాటలు పేలుతూనే ఉన్నారు. ఇదంతా కేవలం అమెరికా అండచూసుకునే అని వేరుగా చెప్పనక్కరలేదు. అమెరికా కూడా గతాన్ని మరచి పాక్‌కు పాలుపోసి పెంచుతోంది. ఎందుకంటే ద్రోహం, వంచనకు మారుపేరు పాకిస్తాన్. ఇన్నాళ్లు కష్టకాలంలో ఆర్థికంగా, సైనికంగా రక్షిస్తూ వస్తున్న డ్రాగన్ కంట్రీ చైనాకు పాకిస్తాన్ నమ్మకద్రోహం చేస్తోంది. పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌లు అమెరికా పంచన చేరి, చైనా ప్రయోజనాలకు భంగం కలిగిస్తున్నారు. రెండుదేశాల మధ్య పాకిస్తాన్ డేంజరస్ గేమ్ ఆడుతోంది. ఇటీవల, పాకిస్తాన్ ట్రంప్‌తో చెట్టాపట్టాలు వేసుకుని తిరుగుతోంది. ముఖ్యంగా, ఇరు దేశాల మధ్య ఖనిజ ఒప్పందం కుదిరింది. దీంతో బలూచిస్తాన్ ప్రాంతంలోని రేర్ ఎర్త్ మినరల్స్,రాగి వంటి లోహాలను అమెరికా కొల్లగొట్టడానికి చూస్తోంది. దీనికి పాకిస్తాన్ ప్రభుత్వం ప్రత్యక్షంగా సహకరిస్తోంది. నిజానికి ఇంతకాలం చైనాతో చెట్టాపట్టాలేసుకుని తిరిగింది. ఆపరేషన్ సిందూర్ లో కూడా చైనా సాయం తీసుకుంది. అమెరికా దగ్గరకు పిలిచి ముద్దు చేయడంతో ఇప్పుడు చైనాకు చెక్ పెట్టి అమెరికా పంచన చేరింది.

అమెరికా, పాకిస్తాన్ స్నేహం భారత్‌కు ఇబ్బందులు తెచ్చిపెట్టే అవకాశం ఉంది. ఇప్పటికే అమెరికా మద్దతుతో పాక్ బలుపు మాటలు మాట్లాడుతోంది. ఇక పస్నీ ద్వారా భారత వ్యూహాత్మక ఓడరేవు చాబహార్‌ని కౌంటర్ చేయవచ్చు. అమెరికా స్నేహం పాకిస్తాన్‌కు మిలిటరీ, ఇంటెలిజెన్స్ వంటి వ్యూహాత్మక సహకారాన్ని అందించవచ్చు. ఈ చర్యల ద్వారా పాకిస్తాన్తన రక్షణ ఒప్పందాలను మెరుగు పరుచుకోవచ్చు. పాకిస్తాన్ భౌగోళిక రాజకీయ విశ్వాసాన్ని పెంచుతుంది. భారత్‌తో పోలిస్తే తన స్థానాన్ని బలోపేతం చేస్తుంది. ఈ చర్యలు ఇరాన్‌కు కూడా ప్రమాదకరమే. ఇరాన్ షిప్పింగ్ లైన్లపై అమెరికా నిఘా పెరుగుతుంది. అమెరికా, పాక్ బందంపై భారత్ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ట్రంప్ ఇప్పుడు భారత్‌ను ఇబ్బంది పెట్టే ఏ చర్యను కూడా వదలడం లేదు. నిజానికి పాకిస్తాన్ ద్వారా అరేబియా సముద్రానికి మార్గాన్ని ఏర్పాటు చేసుకోవాలని 60 బిలియన్ డాలర్లతో చైనా చైనా-పాకిస్తాన్ ఎకనామిక్ కారిడార్‌ను ప్రారంభించింది. బలూచిస్తాన్‌లో గ్వాదర్ పోర్టును నిర్మించింది. అయితే, ఇప్పుడు ఈ గ్వాదర్ పోర్టుకు కేవలం 70 మైళ్ల దూరంలో అమెరికాతో కలిసి పస్నీ ఓడరేవును నిర్మించేందుకు పాకిస్తాన్ సిద్ధమైంది. ఇది భారత్ ఇరాన్‌లో నిర్మిస్తున్న చాబహార్ పోర్టుకు కేవలం 178 మైళ్ల దూరంలోనే ఉంది. చైనా, భారత్, ఇరాన్, ఇరాన్, సౌదీ అరేబియా వంటి దేశాలకు కీలమైన ఈ వ్యూహాత్మక స్థానాన్ని పాకిస్తాన్ అమెరికాకు స్థానం కల్పిస్తోంది. ఈ ఓడరేవు అరేబియా, హిందూ మహాసముద్రంలోని సముద్ర భద్రతకు కూడా చిక్కులు కల్పిస్తుంది. ఈ పస్నీ ఓడరేవు ద్వారా బలూచిస్తాన్‌లోని ఖనిజ సంపదను అమెరికాకు తరలించవచ్చని పాకిస్తాన్ భావిస్తోంది. అయితే, ఇప్పటి వరకు దీనిపై రెండు దేశాలు అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు.

ఒక వేళ కార్యరూపం దాల్చితే, చైనాతో పాటు భారత్ ప్రయోజనాలకు కూడా తీవ్ర భంగం కలిగించవచ్చు. దీని నిర్మాణానికి 1.2 బిలియన్ డాలర్ల వ్యయం అవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ ఓడరేవు బ్యాటరీ టెక్నాలజీ, క్షిపణుల తయారీ, అధునాతన ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల్లో ఉపయోగించే రాగి, యాంటిమోనీ, నియోడైమియం వంటి ఖనిజాల ఎగుమతులకు గేట్‌వేగా మారుతుంది. సెప్టెంబర్ 8న పాకిస్తాన్ మిలిటరీ ఇంజనీరింగ్ కార్ప్స్‌తో 500 మిలియన్ల అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశాయి. పాకిస్తాన్ ఈ ఖనిజాల షిప్‌మెంట్‌ను మిస్సోరీకి చెందిన జా స్ట్రాటజిక్ మెటల్స్‌కి ఎగుమతి చేసింది. అమెరికాను మచ్చిక చేసుకుని భారత్‌పై పగతీర్చుకోవడానికి పాక్ వెనకాడకపోవచ్చు. ఆ దేశ రక్షణమంత్రి, ఆర్మీ చీఫ్‌లు అడపాదడపా చేస్తున్న వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకోవాల్సిందే.

# కప్పు టీ ధరకే 1 జీబీ డేటా..

- పెట్టుబడులకు ఇదే సమయం
- ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ



**న్యూఢిల్లీ :** మొబైల్‌ఫోన్ల నుంచి సెమీ కండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ వరకు అన్ని రంగాల్లో 'మేక్ ఇన్ ఇండియా'పై దృష్టిపెట్టాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. తమ ప్రభుత్వం సంస్కరణలను వేగవంతం చేసిందని, భారత్‌లో పెట్టుబడులకు ఇదే అత్యుత్తమ సమయమని పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. ఈమేరకు ఇండియా మొబైల్ కాంగ్రెస్ ప్రారంభోత్సవ సభలో బుధవారం ఆయన మాట్లాడారు. పెట్టుబడులకు భారత్ అత్యంత అనుకూల గమ్యస్థానంగా అవతరించిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ, పెట్టుబడిదారులను ఆహ్వానించే ప్రభుత్వ విధానాలు, సులభతర వ్యాపార పద్ధతులు ఇందుక్కారణం అని తెలిపారు. వస్తు, సేవల పన్ను రేట్లను సవరించడం ద్వారా షాంపూ నుంచి టెలివిజన్ వరకు చాలా వస్తువులు చవకగా మారాయని చెప్పారు. భారత్‌లో సెమీ కండక్టర్లు, మొబైల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్స్ తయారీలో అపార అవకాశాలు ఉన్నాయని చెప్పారు. పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలు, స్టార్టప్‌లు ముందుకురావాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. గత దశాబ్దంలో మన దేశం డిజిటల్ రంగంలో సాధించిన విశేష ప్రగతిని ప్రస్తావిస్తూ.. భారత్‌లో ఒక జీబీ వైర్‌లెస్ డేటా ధర, ఒక కప్పు టీ ధర కంటే తక్కువని మోదీ వ్యాఖ్యానించారు. డిజిటల్ కనెక్టివిటీ ఇక విలాసమో, ప్రత్యేక హక్కో ఏమాత్రం కాదని, అది ప్రతి భారతీయుడి జీవితంలో విడదీయలేని భాగమైందని పేర్కొన్నారు. భారత్‌లో ప్రస్తుతం డెవలపర్‌ల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని చెప్పారు. భారత్ ప్రపంచంలోనే రెండో అతిపెద్ద టెలికాం మార్కెట్, రెండో అతిపెద్ద 5జీ మార్కెట్‌గా నిలిచిందన్నారు. మానవ వనరులు, మొబిలిటీ, మైండ్‌సెట్.. ఈ మూడింటి శక్తి భారత్‌ను ముందుంచుతోందన్నారు. పూర్తి స్వదేశీ పరికరాలతో ఇటీవల బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు ప్రారంభించడం దేశ విజయమని పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రపంచంలోని ఐదు దేశాల జాబితాలో భారత్ కూడా చేరిందని తెలిపారు. ఒకప్పుడు 2జీ కోసం కష్టపడిన దేశం, ఇప్పుడు దాదాపు ప్రతి జిల్లాలోనూ 5జీ సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు.

# జోహో మెయిల్‌కు మారిన అమిత్ షా

## ఈ-మెయిల్ ఐడీ ఇదే



**న్యూఢిల్లీ :** దేశీయ ఉత్పత్తులు, సేవలను వినియోగించాలన్న ప్రధాని నరేంద్రమోదీ పిలుపును కేంద్రమంత్రులు అందిపుచ్చుకుంటున్నారు. స్వదేశీ టెక్నాలజీని ప్రోత్సహించేందుకు, డిజిటల్ ఇండియాలో భాగంగా 'జోహో' ప్లాట్‌ఫామ్ వైపు మొగ్గుచూపుతున్నారు. అశ్విని వైష్ణవ్, ధర్మేంద్ర ప్రధాన్ ఆ సంస్థ సేవలు వినియోగిస్తుండగా.. కేంద్ర హోంమంత్రి అమిత్ షా జోహో మెయిల్‌లోకి మారిపోయారు. ఈ విషయాన్ని ఆయన ఎక్స్ వేదికగా వెల్లడించారు.
"హలో.. నేను జోహో మెయిల్‌కు మారాను. నా ఈమెయిల్ చిరునామాలో ఈ మార్పును గమనించండి. amitshah.bjp@zohomail.in నా కొత్త మెయిల్ అడ్రస్" అని అమిత్ షా తన పోస్టులో రాసుకొచ్చారు. ఇకనుంచి మెయిల్స్ అన్నీ ఈ కొత్త అడ్రస్‌కే పంపాలని చెప్పారు. భారత్‌పై అమెరికా సుంకాల మోత, జీఎస్టీ సంస్కరణల వేళ ప్రధాని మోదీ 'స్వదేశీ' పిలుపు ఇచ్చిన సంగతి తెలిసిందే. "భారత్ బలమైన దేశంగా ఎదుగుతున్న వేళ.. కొన్ని సవాళ్లు తప్పవు. అటువంటి సమయాల్లో 'ఆత్మనిర్భర్' స్ఫూర్తిని కొనసాగించాలి. ఈ నేపథ్యంలో స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించండి" అని ఎన్డీయే ఎంపీలకు సూచించారు. ఈ నేపథ్యంలోనే మంత్రులు జోహో సేవలను వినియోగిస్తున్నారు. జీమెయిల్, మైక్రోసాఫ్ట్ ఔట్‌లుక్‌కు పోటీగా జోహో మెయిల్‌ను తీసుకువచ్చారు. ఇప్పుడు ఈమెయిల్‌లోకి అమిత్ షా మారగా.. మైక్రోసాఫ్ట్ పవర్‌పాయింట్ బదులు జోహోతోనే కేబినెట్ ప్రజెంటేషన్ తయారు చేసినట్లు అశ్వినీ వైష్ణవ్ వెల్లడించిన సంగతి తెలిసిందే. జోహో రూపొందిన మెసేజింగ్ యాప్ 'అరట్టై'ని వాడాలంటూ ధర్మేంద్ర ప్రదాన్ ఇంతకుముందు పిలుపునిచ్చారు. ప్రస్తుతం అరట్టైకు విశేష ఆదరణ లభిస్తోంది. ఈ యాప్‌ను విపరీతంగా డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. యూజర్ల ప్రైవసీ కోసం త్వరలోనే 'అరట్టై'లోనూ ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్‌ను అందుబాటులోకి తీసుకొస్తామని జోహో సహ వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు తాజాగా వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇందులో సమాచార గోప్యతపై పెద్దఎత్తున చర్చ జరుగుతోన్న సమయంలో ఈ స్పందన వచ్చింది.

# మయన్మార్‌లో తీవ్ర విషాదం

- బౌద్ధ ఉత్సవంపై బాంబులతో దాడి
- 24 మంది మృత్యువాత.. 47మందికి తీవ్ర గాయాలు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 8 :** మయన్మార్‌లో విషాదం చోటుచేసుకుంది. బౌద్ధ ఉత్సవంపై పారాగ్లైడర్ బాంబు దాడి జరిగింది. ఈ ఘటనలో 24 మంది మృతి ప్రాణాలు కోల్పోయారు. 47 మంది గాయపడ్డారు. గుమిగూడిన జనంపై రెండు బాంబులు వేయడంతో 24 మంది చనిపోయారని జుంటా వ్యతిరేక పీపుల్స్ డిఫెన్స్ ఫోర్స్‌కు చెందిన స్థానిక అధికారి తెలిపారు. 47 మంది గాయపడ్డారని చెప్పారు. బౌద్ధ మూలాలతో కూడిన జాతీయ సెలవుదినం అయిన థాడింగ్యుట్ పండుగ కోసం సోమవారం సాయంత్రం చాంగ్ యు టౌన్‌షిప్‌లో సుమారు 100 మంది గుమిగూడి ఉండగా ఈ దాడి జరిగింది. థాడింగ్యుట్ పండుగను లైట్ల పండుగ అని కూడా పిలుస్తారు. మయన్మార్ అంతటా కొవ్వొత్తులు, లాంతర్లు. సామూహిక సమావేశాలు నిర్వహిస్తారు. ఈ సమావేశం సైనిక నిర్బంధం, రాబోయే ఎన్నికలను నిరసిస్తూ.. అలాగే ఆంగ్ సాన్ సూకీతో సహా రాజకీయ ఖైదీల విడుదల కోసం కొవ్వొత్తుల ప్రదర్శన జరిగింది. 2021 తిరుగుబాటులో సైన్యం అధికారాన్ని చేజిక్కించుకున్నప్పటి నుంచి మయన్మార్ అంతర్యుద్ధంలో కొట్టుమిట్లాడుతోంది. అప్పటి నుంచి 5,000 మందికి పైగా పౌరులు మరణించారని ఐక్యరాజ్యసమితి అంచనా వేసింది. అంతర్జాతీయ ఆంక్షల కారణంగా విమానాలు, జెట్ ఇంధన కొరత మధ్య తరచుగా ఆకాశం నుంచి మోర్టార్ తూటాలను జారవిడిచే పారామోటర్ దాడులను సైన్యం ఎక్కువగా ఉపయోగిస్తోంది. ఈ సంవత్సరం ప్రారంభంలో కూడా చాంగ్ యు టౌన్‌షిప్‌లో కూడా ఇలాంటి దాడులు జరిగినట్లుగా అమ్నెస్టీ ఇంటర్నేషనల్ నివేదించింది. ఇక సైన్యం తిరుగుబాటు తర్వాత మొదటిసారిగా డిసెంబర్‌లో సాధారణ ఎన్నికలు జరగనున్నాయి.

# అమెరికా వెళ్లేందుకు జంకు

- ట్రంప్ చర్యలతో చాలా మంది వెనకడుగు
- తగ్గిన విద్యార్థి వీసాలా జారీ

**వాషింగ్టన్, అక్టోబర్ 8 :** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విద్యార్థి వీసాలపై విధించిన కఠిన ఆంక్షలతో.. వీసాల తగ్గుదలలో భారతీయ విద్యార్థులే అగ్రస్థానంలో ఉన్నట్లు నివేదిక తెలిపింది. బెదిరింపు విధానాలు, ఆంక్షల మధ్య అమెరికా వెళ్లేందుకు భారీతీయ విద్యార్థులు వెనకడుగు వేస్తున్నారు. దీంతో ఈయేడు అమెరికా వెళ్లాలనుకున్న వారు తగ్గారు. ఆగస్టులో అమెరికా సుమారు ఐదోవంతు తక్కువ విద్యార్థి వీసాలు జారీ చేసిందని, దీంతో భారతీయ విద్యార్థుల సంఖ్య పడిపోయిందని ఇంటర్నేషనల్ ట్రేడ్ అడ్మినిస్ట్రేన్ విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. అమెరికా యూనివర్సిటీల్లో విద్యాసంవత్సర ప్రారంభ నెల అయిన ఆగస్టులో 3,13,138 విద్యార్థి వీసాలను జారీ చేసింది. ఇది 2024 ఆగస్టుతో పోలిస్తే 19.1శాతం తగ్గినట్లు వెల్లడించింది. గతేడాది అమెరికాకు వెళ్లిన విద్యార్థుల్లో భారతీయ విద్యార్థులు అగ్రస్థానంలో ఉన్న సంగతి తెలిసిందే. గతేడాది కన్నా 44.5శాతం తక్కువ విద్యార్థి వీసాలు జారీ అయ్యాయి. అదే సమయంలో చైనా విద్యార్థులకు 84,647 వీసాలను జారీ చేసింది. ఇది భారతీయ విద్యార్థులకు జారీ చేసిన వీసా సంఖ్య కన్నా రెట్టింపు కంటే ఎక్కుగా ఉన్నట్లు నివేదిక తెలిపింది. అయితే ఈనివేదిక అమెరికాలో విద్యనభ్యసిస్తున్న మొత్తం అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్యను ప్రతిబింబించదు. వీరిలో చాలా మది గతంలో జారీ చేసిన వీసాలపైనే నివసిస్తున్నారు. తాజా గణాంకాలు అనేక ముస్లిం దేశాల నుండి విద్యార్థి వీసాలలో గణనీయ మైన తగ్గుదల నమోదైనట్లు నివేదిక తెలిపింది. ఇరాన్ నుండి ప్రవేశాలు 86శాతం తగ్గాయి. అమెరికా అధ్యక్షునిగా రెండోసారి బాధ్యతలు చేపట్టినప్పటి నుండి ట్రంప్ శరణార్థులు, వీసాల జారీపై ఆంక్షలు విధించారు. జూన్‌లో విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో విద్యార్థి వీసాల ప్రాసెసింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేశారు. దరఖాస్తుదారుల సోషల్ మీడియా ఖాతాలను పరిశీలించాలని రాయబార కార్యాల యాలకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. ఐటి నిపుణుల కోసం జారీ చేసే హెచ్1బి వీసాల రుసుమును కూడా ట్రంప్ భారీగా పెంచారు. ఈ క్రమంలో అమెఇరాకా అంత సులువు కాదన్న భావనలో భారతీయ విద్యార్థులు ఉన్నారు.



# కాలిఫోర్నియాలో దీపావళి సెలవు

## ప్రకటన చేసిన గవర్నర్

**శానిఫ్రాన్సిస్కో, అక్టోబర్ 8 :** భారత్‌లో జరిగే అతిముఖ్యమైన పండగల్లో దీపావళికి ప్రత్యేకత ఉంది. దీపావళి మన దేశంలోనే కాకుండా విదేశాల్లో కూడా ప్రాచుర్యం పొందింది. అగ్రరాజ్యం అమెరికాలోనూ దీన్ని ఘనంగా నిర్వహిస్తారు. తాజాగా కాలిఫోర్నియా ఈ పండగను అధికారిక సెలవు రోజుగా ప్రకటించింది. కాలిఫోర్నియా గవర్నర్ న్యూసమ్ ఈ మేరకు ఓ ప్రకటనలో తెలిపారు. దీపావళి పండగను అమెరికాలో సెలవు రోజుగా ప్రకటించాలని ప్రతిపాదిస్తూ గతంలో ఆ దేశ కాంగ్రెస్‌లో ఓ బిల్లు తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు దాన్ని కాలిఫోర్నియా స్టేట్ అసెంబ్లీ ఆమోదించింది. అసెంబ్లీ సభ్యుడు ఆష్ కల్రా ప్రవేశపెట్టిన బిల్లుపై తాను సంతకం చేశానని న్యూసమ్ పేర్కొన్నారు. ఈ బిల్లుపై గతంలో కల్రా మాట్లాడుతూ.. 'కాలిఫోర్నియాలో అత్యధికంగా భారతీయ అమెరికన్లు ఉన్నారు. ఈ పండుగ రోజును అధికారికంగా సెలవుగా ప్రకటిస్తే అది లక్షలాది మంది కాలిఫోర్నియా ప్రజల్లో సంతోషాలు నింపుతుంది. సద్భావన, శాంతి, ఉమ్మడి భావన అనే సందేశాలతో సమాజాన్ని ఈ పండగ ఒకచోట చేర్చుతుంది' అని ఆయన పేర్కొన్నారు. కాగా.. పెన్సిల్వేనియా, న్యూయార్క్‌లు ఇప్పటికే దీపావళికి అధికారికంగా ఇలాంటి గుర్తింపును ఇచ్చాయి. తాజాగా భారతీయ పర్వదినానికి ఈ రకమైన గుర్తింపు ఇచ్చిన మూడో రాష్ట్రంగా కాలిఫోర్నియా నిలిచింది. ఈ నిర్ణయంతో ఇక్కడి ఎన్నారైలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# లైఫ్ సర్టిఫికెట్ పేరిట..

## రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగికి టోకరా



**హైదరాబాద్:** లైఫ్ సర్టిఫికేట్ పేరిట నగరంలోని బర్కత్ పురకు చెందిన ఓ రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగిని సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టించారు. ఆయన వద్ద నుంచి రూ.12.99 లక్షలు కాజేశారు. విశ్రాంత ఉద్యోగి ఇటీవల ఫేస్‌బుక్‌లో పంజాబ్ నేషనల్ బ్యాంకు లైఫ్ సర్టిఫికేట్ పేరిట ఉన్న ఓ లింక్‌ను క్లిక్ చేశారు. సైబర్ పన్నాగం అని తెలియక.. బ్యాంకు అకౌంట్ వివరాలను అందజేశారు. అనంతరం బ్యాంక్ లోగో డీపీతో కేటుగాళ్లు వాట్సాప్‌లో ఆయన్ను సంప్రదించారు. లైఫ్ సర్టిఫికెట్ ప్రాసెస్ చేయడానికి అంటూ ఓ ఏపీకే ఫైల్ పంపించి ఇన్‌స్టాల్ చేయాలని సూచించారు. నిజమని నమ్మి ఆయన అలాగే చేశారు. కాసేపటికే ఆయన సేవింగ్ అకౌంట్ నుంచి రూ.12.99 లక్షలు మాయమయ్యాయి. మోసపోయానని గ్రహించిన బాధితుడు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# పటాన్‌చెరులో ఐటీ ఉద్యోగికి టోకరా..

## రూ.54లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

**పటాన్‌చెరు:** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో ఐటీ ఉద్యోగికి సైబర్ నేరగాళ్లు టోకరా వేశారు. బ్రాండెడ్ వస్తువులకు రేటింగ్ ఇస్తే కమీషన్ ఇస్తామంటూ రూ.54లక్షలు దోచేశారు. విడతల వారీగా ఈ డబ్బును కాజేశారు. గతనెల 15న ఐటీ ఉద్యోగికి టెలిగ్రామ్‌లో సైబర్ నేరగాళ్లు మెసేజ్ పంపారు. తొలుత రూ.5వేలు పెట్టుబడి పెడితే రూ.12వేలు రావడంతో ఐటీ ఉద్యోగి నిజమేనని నమ్మారు. ఆ తర్వాత రూ.54లక్షల పెట్టుబడి పెట్టి బాధితుడు మోసపోయాడు. దీనిపై పటాన్‌చెరు పోలీసులకు ఐటీ ఉద్యోగి ఫిర్యాదు చేశాడు.



# రెండో భార్యను దారుణంగా హతమార్చి..

## ఫొటోలు మొదటి భార్యకు పంపి..

**చేవెళ్ల:** రంగారెడ్డి జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. భార్యను భర్త కిరాతకంగా హతమార్చాడు. చేవెళ్ల మండలం వెంకన్నగూడలో ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. వెంకన్నగూడకు చెందిన వానరాశి జంగయ్య హైదరాబాద్‌లో డ్రైవింగ్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి ఇద్దరు భార్యలు ఉన్నారు. మొదటి భార్య ఉండగానే 15 ఏళ్ల క్రితం రజిత అనే మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. వారికి ఇద్దరు పిల్లలున్నారు. మూడేళ్ల క్రితం భర్త నుంచి రజిత విడిపోయింది. మొదటి భార్యతో వెంకన్న ఉంటున్నాడు. రజిత ఆచూకీ తెలుసుకుని సోమవారం ఆమెను వెంకన్నగూడకు తీసుకొచ్చాడు. గ్రామపెద్దల సమక్షంలో మంగళవారం ఉదయం మాట్లాడారు. ఇద్దరం కలిసి ఉందామని రజితతో జంగయ్య చెప్పగా.. ఆమె అంగీకరించలేదు. రజితను ఒప్పించేందుకు జంగయ్య యత్నించాడు. అంగీకారం తెలపకపోవడంతో మద్యం మత్తులో ఆమె మెడకు చున్నీ బిగించి హతమార్చాడు. చావలేదనే అనుమానంతో అక్కడే ఉన్న సిమెంట్ రాయితో ఛాతీపై బలంగా కొట్టాడు. ఆ తర్వాత ఫొటోలు తీసి తన మొదటి భార్యకు పంపి.. ఇలా చంపానని చెప్పాడు. అనంతరం గ్రామ సర్పంచ్ నర్సింలుకు సమాచారమిచ్చి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



## ఎన్నికల విధులు నిబంధనల ప్రకారం
# కట్టుదిట్టంగా నిర్వహించాలి
### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** స్థానిక ఎన్నికల నిబంధనలపై అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లా కలెక్టర్ మధిర నియోజకవర్గంలో అదనపు కలెక్టర్ పి. శ్రీజతో కలిసి బుధవారం పర్యటించారు. మధిర మండలం పరిధిలోని 175 మంది స్థానిక సంస్థల ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు మధిర పట్టణంలోని రిక్రియేషన్ క్లబ్ కళ్యాణ వేదిక నందు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ట్రైనింగ్ కార్యక్రమంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగహన కల్పిస్తూ ఎన్నికల విధుల పట్ల కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలి ప్రతి అధికారి కొత్తగా ఎన్నికలను నిర్వహిస్తున్నట్లు భావించి జాగ్రత్తగా నిబంధనల ప్రకారం విధులు నిర్వహించాలని, ఎక్కడా నిర్లక్ష్యం ప్రదర్శించడానికి వీలు లేదని అన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ఈవిఎం యంత్రాలతో జరిగితే, స్థానిక సంస్థల ఎన్నికలు బ్యాలెట్ ద్వారా జరుగనున్నాయి అని, ప్రతి చిన్న అంశాన్ని, అనుమానాలను శిక్షణలో పూర్తి స్థాయిలో విచారించి తెలుసుకోవాలని కలెక్టర్ సూచించారు. ట్రైనింగ్ హాల్ నుంచి సంపూర్ణ అవగాహన తో బయటకు పోవాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలంటే మనకు నిబంధనలపై సంపూర్ణ పట్టు ఉండాలన్నారు. రిసెప్షన్ కేంద్రంలో పోలింగ్ సామాగ్రి తీసుకున్న దగ్గర నుంచి మళ్లీ అప్పగించే వరకు పూర్తి బాధ్యత పోలింగ్ సిబ్బందిపై ఉంటుందని అన్నారు. రిజర్వ్ ఉన్న అధికారులు కూడా రిపోర్ట్ చేయాలని అన్నారు. శిక్షణకు రాని సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయడం జరుగుతుందని అన్నారు. పోలింగ్ కేంద్రాలలో మనం చేసే ప్రతి పని నిబంధనల ప్రకారం జరగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మధిర తహసీల్దారు రాంబాబు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీటీసీ రేసులో
# వల్లాల రాధాకృష్ణ హవా!
### అందరి దృష్టి ఆయన పైనే..



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** నేలకొండపల్లి జడ్పీటీసీ పీఠం కోసం అధికార పార్టీలో పోటీ తీవ్రంగా ఉంది. ముఖ్యంగా బీసీ జనరల్ రిజర్వేషన్‌తో ఈ స్థానం హాట్ టాపిక్‌గా మారింది. ఈ ఆశావహుల జాబితాలో, కొత్తకొత్తూరు గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ తన బలమైన అభ్యర్థిత్వంతో దూసుకు పోతున్న సమాచారం రాధాకృష్ణ వైపు మొగ్గ చూపుతున్న పార్టీ వర్గాలు? ప్రస్తుతం నేలకొండపల్లి జడ్పీటీసీ పీఠం కోసం ప్రధానంగా ముగ్గురు నేతలు రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. జనంలో విశేష అభిమానం ఉన్న వల్లాల రాధాకృష్ణ. అయితే, రాధాకృష్ణ కి పార్టీలో, స్థానికంగా ఉన్న అపారమైన మద్దతు ఆయనను ఫేవరెట్‌గా నిలబెడుతోంది. గ్రామ స్థాయి సేవలు సర్పంచ్‌గా పనిచేసిన అనుభవం, గ్రామంలోని ప్రజలతో ఆయనకున్న సన్నిహిత సంబంధాలు, నిరంతరం ఆయన అందించిన సేవలు.. వీటిని పార్టీ నాయకత్వం కూడా సానుకూలంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. గెలుపు గుర్రం: రాధాకృష్ణ కి ఉన్న ప్రజాదరణ, ఆయన విజయంపై ఉన్న నమ్మకం దృష్ట్యా, గెలుపు గుర్రాన్నే రంగంలోకి దింపాలని భావిస్తున్న పార్టీ అధిష్టానం.. ఆయన అభ్యర్థిత్వాన్ని సీరియస్‌గా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

**బలమైన లాబీయింగ్:** ముఖ్య నేతలతో ఆయన జరుపుతున్న మంతనాలు సఫలమైనట్లు, మంత్రి శ్రీనివాసరెడ్డి ఆశీస్సులు పొందడంలో ఆయన ముందంజలో ఉన్నట్లు సమాచారం. స్థానిక సంస్థల పోరులో రాధాకృష్ణ కీలక పాత్ర నేలకొండపల్లి మండలం ఎంపీపీ, జడ్పీటీసీ పీఠాలు రెండూ బీసీలకు కేటాయించిన నేపథ్యంలో, బీసీ నేతలకు ఉన్న ఈ సువర్ణావకాశాన్ని వల్లాల రాధాకృష్ణ గట్టిగా వినియోగించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఎంపీటీసీ స్థానాలలో మెజార్టీ గెలిచి, పార్టీకి జడ్పీటీసీ కుర్చీని దక్కించుకోవడానికి ఆయన తన వంతుగా గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తల మద్దతును కూడగట్టుకుంటున్నారు. పార్టీ అధిష్టానం కూడా రహస్యంగా ఆశావహుల గురించి వివరాలు సేకరిస్తోంది, ముఖ్యంగా సర్వేల ద్వారా ప్రజాభిమానం ఎవరి వైపు ఉందో తెలుసుకుంటోంది. ఈ సర్వేలలో వల్లాల రాధాకృష్ణకి మెజారిటీ మొగ్గు ఉన్నట్లు తెలుస్తోంది. టిక్కెట్టు ప్రక్రియలో టెన్షన్ కొనసాగుతున్నప్పటికీ, వల్లాల రాధాకృష్ణ మాత్రం ధైర్యంగా తన ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. మరి ఈ ప్రతిష్టాత్మకమైన జడ్పీటీసీ పీఠం ఎవరికి దక్కుతుందో, మంత్రి శ్రీనివాసరెడ్డి ఆశీస్సులు ఎవరికి లభిస్తాయో తెలియాలంటే వేచి చూడాల్సిందే.



## నిరుపేద రైతు నుండి
# డబ్బులు దొంగిలించిన దుండగులు

**సూర్యాపేట,రాజముద్ర న్యూస్ :** సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగిన దారుణ సంఘటన మనసును కలచి వేస్తుంది కేతపల్లి మండలం భీమారం గ్రామానికి చెందిన గుడపూరి సోమయ్య సునీత దంపతులు రేక్కాడితే కానీ డొక్కాడని నిరుపేద దళిత కుటుంబం వివరాల్లోకి వెళితే ఒక ఎకరం ఉన్న రైతు ఇంకో రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం కొనసాగిస్తున్నాడు భార్యాభర్తలిద్దరూ కష్టపడి కూలినాలీ పనులు చేస్తూ వ్యవసాయం చేసుకుంటూ పోలానికి పెట్టుబడి కి డబ్బులు లేక సూర్యాపేట జిల్లా కేంద్రంలో ని కూడా కూడా రోడ్డులో గల యూనియన్ బ్యాంకు లో క్రాఫ్ లోన్ కు అప్లై చేసుకోగా లోను శాంక్షన్ అయింది సెప్టెంబర్ ఆరో తారీఖు నాడు భార్య భర్తలు ఇద్దరూ బ్యాంకులో లక్ష రూపాయలు డ్రా చేసుకొని లోకల్ ఆటో ఎక్కి శంకర్ విలాస్ సెంటర్ వద్దనున్న యూనియన్ బ్యాంకు వద్దకు వస్తుండగా మార్గమధ్యంలో కొత్త బస్టాండ్ ఫ్లైఓవర్ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు ముగ్గురు ఆటో ఎక్కి రైతు వద్ద ఉన్న డబ్బులను కవర్లో నుండి కట్ చేసి డబ్బు దొంగిలించారు వార్ గాంధీ బొమ్మ వద్ద దిగిపోగా ఈ రైతులు శంకర్ విలాస్ సెం టర్ వద్ద యూనియన్ బ్యాంక్ వద్ద దిగి డబ్బులు చూసుకోగా డబ్బులు పోయినవి అని గుర్తించి మళ్లీ కొత్త బస్టాండ్ ఫ్లైఓవర్ వద్దకు వెళ్లి అక్కడ వెతికి అక్కడ నుండి సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్ కు వెళ్లి ఫిర్యాదు చేసినారు మేము నిరుపేద కుటుంబానికి చెందిన వారము మాకు ఇద్దరు ఆడపిల్లలు లక్ష రూపాయలు దొంగత నం జరగడంతో మేము మా కుటుంబ రోడ్డున పడ్డాము కనీసం ఇల్లు కూడా లేని మాపై కనికరించి చట్ట ప్రకారం న్యాయం చేయాలని దొంగిలించిన దుండగులను పట్టుకొని మా డబ్బులు ఇప్పించగలరని ప్రభుత్వాన్ని అధికారులను కోరుతూ బోరున ఏడుస్తూ విలపించారు.

## బీఆర్ఎస్ పార్టీకి చెందిన 85 కుటుంబాలు
# కాంగ్రెస్ పార్టీలో చేరిక
### మంత్రి తుమ్మల క్యాంపు కార్యాలయంలో చేరికలు



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** కాంగ్రెస్ పాలనలో రఘునాథపాలెం మండలానికి మహర్దశ పట్టనుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం క్యాంప్ కార్యాలయంలో పార్టీ చేరికల కార్యక్రమంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ సీఎం రేవంత్ ప్రజా పాలనలో అన్ని వర్గాలు సంతోషంగా ఉండేలా అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని కాంగ్రెస్ పాలన మెచ్చే ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్ లో చేరుతున్నారని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజ్ నిర్మాణం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మరియు స్వామి నారాయణ గురుకుల పాఠశాల ఏర్పాటు తో రఘు నాథపాలెం మండలం విద్యా రంగం అభివృద్ధి లో ముందడుగు సాగు నీటి వసతి తోఉద్యాన పంటల సాగు ఆయిల్ ఫామ్ సాగు తో రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు ,సన్నబియ్యం పథకంతో బడుగు బలహీన వర్గాలకు కాంగ్రెస్ అండగా ఉంటుందనీ మంత్రి తుమ్మల భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ లో చేరిన నేతలు గాజుల క్రిష్ణ రావు తో 85 కుటుంబాలు చేరినారు. మేయర్ నీరజ, సాదు రమేశ్ రెడ్డి, గుత్తా వెంకటేశ్వర రావు, కమర్తపు మురళి,పాలెపు వెంకట రమణ,దిరిశాల వెంకటేశ్వర్లు,యరగర్ల హన్మంతరావు, తాత రఘురామ్, దీప్లా నాయక్ ,దుడిపుడి రామారావు,దేవ్ సింగ్ ,రెంటాల ప్రసాద్,బోయన వెంకట నర్సయ్య ,అల్లిక సీతయ్య రామకృష్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## రక్ష హాస్పిటల్‌ను ప్రారంభించిన మార్కెట్ కమిటీ చైర్మన్



**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** సూర్యాపేట జిల్లా కేంద్రం లోని 45వ వార్డులో మిఠాయిపోట్లం స్వీట్స్ షాప్ సమీపంలో చింతరెడ్డి వినీల పాపిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్ష హాస్పిటల్ ను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు ఉండేలా నూతన హాస్పిటల్ ఏర్పాటు కావడం హర్షణీయమన్నారు. ప్రత్యేకంగా సూర్యాపేట పట్టణ ప్రజలకు అత్యవసర సమయంలో త్వరితగతిన వైద్యం అందేలా రక్ష హాస్పటల్ ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హాస్పటల్ మేనేజ్మెంట్ చింతరెడ్డి వినీల పాపిరెడ్డి, మాట్లాడుతూ హాస్పిటల్లో 24 గంటలు అత్యవసర సేవలు, జనరల్ మెడిసిన్, గైనకాలజిస్ట్ వంటి విభాగాల్లో సేవలు అందించనున్నట్లు తెలిపారు. అధునాతన టెక్నాలజీ, అనుభవజ్ఞులైన వైద్యుల సహకారంతో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు తాము సిద్ధమని పేర్కొన్నారు. సామాన్య ప్రజలకు అందుబాటులో ఉంటూ,విశ్వసనీయ సేవలతో రక్ష హాస్పటల్ ప్రజలలో విశ్వాసం పొందేలా పనిచేస్తుందని తెలిపారు. ప్రజల సహకారంతో ఈ ఆసుపత్రిని ఈ ప్రాంతంలో ప్రముఖ వైద్య సంస్థగా తీర్చిదిద్దాలని సంకల్పించామని హాస్పటల్ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ డాక్టర్స్ కోల యశ్వంత్ కుమార్ (ఎంబిబిఎస్ ఎండి ఉస్మానియా),డాక్టర్ బి రేఖ(ఎంబిబిఎస్ ఎంఎస్ ఓ బి జి ఉస్మానియా),యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎలిమినేట్ అభినయ్, డాక్టర్ రంగారెడ్డి,డాక్టర్ ప్రమీల, డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్, డాక్టర్ ఆనంద్ దండ్గే,డాక్టర్ రమేష్ నాయక్,డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, యమ ప్రభాకర్,తోట శ్యాం ప్రసాద్,నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**ఆత్మకూర్ (ఎం )రాజముద్ర న్యూస్ :** కొరటికల్ గ్రామంలో బీఆరెస్ కార్యకర్త పల్లపు హరీష్ అనారోగ్య కారణంగా మరణించాడు వారి కుటుంబాన్ని కోరటికల్ గ్రామ తాజా మాజీ సర్పంచ్ కోల సత్తయ్య గౌడ్ పరామర్శించి కే హెచ్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ %ఁ% బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొప్పుల హారదీప్ రెడ్డి. సహాయంతో 5000₹ రూపాయలు వారి కుటుంబానికి అందించారు ఈ కార్యక్రమంలో బీఆరెస్ గ్రామ శాఖ అధ్యక్షులు నరుకుడు బిందెల సైదులు, సెక్రటరీ జనరల్ చుంచు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ పెండెం పురుషోత్తం, మండల కార్యదర్శి సోలిపురం రాంరెడ్డి, బీఆర్ఎస్వి మండల అధ్యక్షులు చుంచు నాగరాజు, తాజా మాజీ వార్డు సభ్యులు శివరాత్రి అశోక్, సీనియర్ నాయకులు బెజ్జరబోయిన లక్ష్మణ్,పల్లపు సిద్దయ్య,పల్లపు శ్రీనివాస్ ,శివరాత్రి ఎల్లయ్య, శివరాత్రి మహేష్,శివరాత్రి మహేష్,పల్లపు స్వామి,పల్లపు విజయ్, బొంత విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఆర్థిక సాహాయం

**ఆత్మకూర్(ఎం) రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు( ఎం). మండలంలోని పుల్లాయిగూడెం గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన రాచమళ్ళ మల్లయ్య అనారోగ్యంతో మరణించడం జరిగింది, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ బి.ఆర్.ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఫౌండేషన్ అధినేత లికొప్పుల హరిదీప్ రెడ్డి సహకారంతో గ్రామ శాఖ ఆధ్వర్యంలో 5000/- రూపాయలు ఆర్థిక సాహయం వారి కుటుంబానికి అందజేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో నాయకులు మాద భూపాల్,బత్తిని ప్రవీణ్, ఆవుల శ్రీను, పుట్ట నర్సి రెడ్డి,ఆవుల విష్ణు, బండి యాదగిరి, సురిగెల కనకయ్య,తండా బిక్షం, ఉడుతల సిద్ధిరాములు, బండి చంద్రయ్య, తండ ఏకస్వామి, కమ్మగాని సుదర్శన్, సురిగెల మహేష్, ఉడుతల సురేష్ , భాషబోయిన లింగం తదితరులు పాల్గొన్నారు.



## ముదిగొండలో ఎన్నికల సిబ్బందికి శిక్షణ

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** ముదిగొండ రైతు వేదికలో మంగళవారం ఎన్నికల సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ప్రత్యేకాధికారి మహేష్ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ, ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించాలని సూచించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని, నియమాలు పాటిస్తూ పారదర్శకంగా విధులు నిర్వహించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సునీతా ఎలిజబెత్, ఎంపీడీవో శ్రీధర్ స్వామి, ఎంపీఓ కిషోర్, సూపరింటెంట్ భాస్కరరావు పాల్గొన్నారు.



## కృష్ణాపురంలో ఉచిత వైద్య శిబిరం
### వైద్యాధికారి రహీల్

**వాజేడు, రాజముద్ర న్యూస్:** మండల కేంద్రంలో పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కృష్ణాపురం గ్రామంలో వైద్యాధికారి రహీల్,ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసి. 65 మందికి గాను వైద్య పరీక్షలు చేశారు. 10 మందికి జ్వరపీడుతలకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయగా ఎటువంటి మలేరియా గా నమోదు కాలేదని, ఇద్దరికీ బిపి ఉన్నట్లు నిర్ధారణం కాగా తగు మందులు అందజేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ... వాతావరణ మార్పుల వలన కొంతమందికి చర్మ వ్యాధులు వస్తున్నాయని, తగు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. చర్మ వ్యాధులు సోకకుండా తీసుకోవలసిన ముందు జాగ్రత్త చర్యల గురించి నివారణ పద్ధతులను తెలియజేశారు. అసంక్రమిత వ్యాధుల కొరకు పరీక్షలు చేయగా,కాలానుగుణంగా వాతావరణ మార్పులకు అనుగుణంగా విష జ్వరాలు ప్రబలించే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,కాచి చల్లార్చిన నీరు త్రాగాలని, దోమలు కుట్టకుండా రక్షించుకుంటూ వ్యాధి నిరోధకతను పెంచుకొనుటకు సమతుల ఆహారం తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ వేణుగోపాల్ కృష్ణ, హెచ్ ఏ తిరుపతి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.



## సోలార్ విద్యుత్ తో పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చు

**సూర్యాపేట, రాజముద్ర న్యూస్ :** సోలార్ విద్యుత్ తో పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చునని బిఆర్ఎస్ జిల్లా నాయకులు ప్రభాకర్ రెడ్డి,మాజీ జెడ్పిటిసి జీడి బిక్షం అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కుడా కూడ రోడ్డులో గల రిషిక సోలార్ ఎనర్జీ సిస్టం కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. సోలార్ సిస్టంతో అనేక లాభాలు ఉన్నాయని ముఖ్యంగా కరెంటు బిల్లు 95 శాతం వరకు తగ్గించుకోవచ్చు అన్నారు. కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ 78 వేల వరకు ఇస్తుందని అదేవిధంగా 90% బ్యాంకు లోన్స్ సౌకర్యం కలదన్నారు. మిగులు విద్యుత్ అమ్మకం ద్వారా అధిక ఆదాయం పొందే అవకాశం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా రిషిక ఎనర్జీ సిస్టం ప్రైవేట్ లిమిటెడ్ ఎండి వడ్లకొండ రమేష్ గౌడ్ మాట్లాడుతూ సోలార్ పై పెట్టె పెట్టుబడి మూడు నుంచి నాలుగు సంవత్సరాలలో తిరిగి వచ్చే అవకాశం ఉందన్నారు. 25 సంవత్సరాల పాటు వారంటీ ఉంటుందని ఇంటి ఆస్తి విలువ కూడా పెరిగే అవకాశం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రిషిక ఎనర్జీ సిస్టం ప్రైవేట్ లిమిటెడ్ సూర్యాపేట జిల్లా డీలర్ రత్నావత్ రాంబాబు,ఇషిక ఎనర్జీ సిస్టం ప్రైవేట్ లిమిటెడ్ హెచ్ఆర్ జోష్ణ రావు,మూర్తి డీలర్లు ప్రశాంత్, నరేష్, శివ,రమేష్,అఖిల్, నాయకులు రత్నావత్ నాగరాజు, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

# మధిర ఆర్టీసీ డిపోలో అంతులేని సమస్యలు

### ప్రయాణికులు, కార్మికులకు తీవ్ర ఇబ్బందులు

**ఖమ్మం జిల్లాలోని మధిర ఆర్టీసీ డిపో వ్యవహారశైలిపై ప్రయాణికులు, ఉద్యోగుల నుండి తీవ్ర స్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆర్డినరీ బస్సులు నడుపుతూ ఎక్స్‌ప్రెస్ చార్జీలు వసూలు చేయడం, డిప్యూటీ సీఎం ఆదేశాలను కూడా బేఖాతరు చేస్తూ సర్వీసులను నడపకపోవడం, ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యం వహించడం వంటి అనేక అంశాలపై ప్రజలు, కార్మికులు లబోదిబో మంటున్నారు. డిపోలో నెలకొన్న సమస్యలు ప్రయాణికులకు, ఉద్యోగులకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తున్నాయి.**



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** మధిర ఆర్టీసీ డిపోలో ప్రయాణికులపై ఆర్థిక భారం మోపుతున్న వైనం ప్రధాన సమస్యగా మారింది. విజయవాడ-ఖమ్మం వంటి రూట్లలో పల్లె వెలుగు బస్సులు నడుపుతున్నప్పటికీ, వాటికి ఎక్స్‌ప్రెస్ చార్జీలు వసూలు చేస్తున్నారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేరుకు మాత్రమే పల్లె వెలుగు బస్సులు అని, టికెట్ మాత్రం ఎక్స్‌ప్రెస్ చార్జీలు ఉండటం వల్ల గ్రామీణ ప్రాంత ప్రజలపై అధిక భారం పడుతోందని వారు అంటున్నారు. ముఖ్యంగా, సాయంత్రం 7 గంటల తర్వాత మధిర నుండి ఖమ్మంకు బస్సులు అందుబాటులో లేకపోవడం, అలాగే సాయంత్రం 6:30 దాటిన తర్వాత మధిర-వైరా మధ్య ఆర్డినరీ బస్సులు నడపకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో అత్యవసర పనుల మీద ప్రయాణించే వారు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించక తప్పడం లేదు. అంతేకాక, డిపోలో బస్సు సర్వీసులకు ఒక టైం టేబుల్ లేకుండా ఇష్టం వచ్చినట్లు నడుపుతున్నారని, దీనివల్ల బస్సుల కోసం గంటల తరబడి వేచి చూడాల్సి వస్తుందని ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారు.

### డిప్యూటీ సీఎం ఆదేశాలకు దిక్కారం!

మధిర నియోజకవర్గానికి చెందిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్వయంగా జోక్యం చేసుకుని, ఏ రూట్‌లో ఎక్కువ ఆదాయం వస్తుందో చూసి, ప్రతి పల్లెటూరు కలిసే విధంగా బస్సులు నడపాలని ఆదేశించినా కూడా మధిర ఆర్టీసీ డిపో అధికారులు వాటిని బేఖాతరు చేస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. అంతేకాక, మధిర డిపో నుండి చుట్టుపక్కల ఉన్న మూడు ముఖ్య పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడపాలని డిప్యూటీ సీఎం ఆదేశించినప్పటికీ, ఇంతవరకు ఆ ఆదేశాలు అమలు కాలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజల సౌకర్యాన్ని, ప్రముఖుల ఆదేశాలను కూడా పట్టించుకోకుండా డిపో అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది.

### ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యం, ఫిట్‌నెస్ లేని బస్సులు.

ప్రయాణికులతో పాటు ఆర్టీసీ కార్మికులు కూడా డిపో అధికారుల తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. కార్మికులకు సర్వీసులను విపరీతంగా పెంచి, కనీసంగా విశ్రాంతి (గ్యాప్) కూడా ఇవ్వట్లేదని వారు ఆవేదన చెందుతున్నారు. ముఖ్యంగా మహిళా కార్మికుల పట్ల కూడా మానవత్వం చూపకుండా, రాత్రి ఒంటిగంట దాటిన తర్వాత కూడా డ్యూటీలకు పంపిస్తున్నారని మహిళా కండక్టర్లు వాపోతున్నారు. వీటన్నిటికీ తోడు, మధిర ఆర్టీసీ డిపోలో ఉన్న బస్సులలో సగం బస్సులు ఫిట్‌నెస్ లేకుండానే నడుపుతున్నారని కార్మికులు చెబుతున్నారు. ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన రవాణా వ్యవస్థలో, ఫిట్‌నెస్ లేని వాహనాలు నడపడం పట్ల ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### అధికారుల జోక్యం కోసం ప్రజల విజ్ఞప్తి

ప్రస్తుతం మధిర ఆర్టీసీ డిపోలో నెలకొన్న ఈ క్లిష్ట పరిస్థితులపై సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే కలుగజేసుకోవాలని ప్రజలు, కార్మికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆర్డినరీ బస్సులకు ఎక్స్‌ప్రెస్ చార్జీలు రద్దు చేసి, డిప్యూటీ సీఎం ఆదేశాలను అమలు చేయాలని కోరుతున్నారు. అంతేకాక, టైమ్ టేబుల్ ప్రకారం బస్సులు నడిపి, రాత్రి వేళల్లో కూడా సర్వీసులను పెంచి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఆర్టీసీ కార్మికులకు తగిన విశ్రాంతి కల్పించి, మహిళా ఉద్యోగుల పట్ల సరైన విధానాలను అమలు చేయాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి. మధిర ఆర్టీసీ డిపోను గాడిలో పెట్టేందుకు అధికారులు ఎప్పుడు చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒక్కరికి ఒక రోజు జైలు శిక్ష

## పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం



**సూర్యాపేట,రాజముద్ర న్యూస్ :** మద్యం సేవించి వాహనాలు నడిపిన నలుగురిలో ఒక్కరికి ఒక రోజు జైలు శిక్ష,జరిమానా మరియు మరో ఇద్దరికి జరిమానా సూర్యాపేట కోర్టు విధించినట్లు సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్సై సాయిరాం తెలిపారు. సూర్యాపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోనీ పలు ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో ముగ్గురు పట్టుబడినట్లు తెలిపారు. వారిని కోర్టులో హాజరుపర్చగా ఒక్కరికి ఒక్క రోజు జైలు శిక్ష 2000రూ జరిమానా, మరో ఇద్దరికి కలిపి రూ.2,000- జరిమానా విధిస్తూ సూర్యాపేట ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి పి.వి రమణ తీర్పు వెల్లడించినట్లు ఎస్సై తెలిపారు. జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానాతో పాటు జైలుకు వెళ్లాల్సి ఉంటుందని ఈ సందర్భంగా హెచ్చరించారు... పోలీసులు చేసే వాహన తనిఖీలు ప్రజల ప్రాణరక్షణ కోసమే అని, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు....



# ఏటీసీని తనిఖీ చేసిన కలెక్టర్ ప్రతీక్ జైన్

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** ఏటీసీలలో సాంకేతిక నైపుణ్యతతో కూడిన శిక్షణను అందించాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. బుధవారం వికారాబాద్ పట్టణ కేంద్రంలోని ఆధునాతన సాంకేతిక కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఏటీసీలో గల సౌకర్యాలపై కలెక్టర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా ఏటీసీలో శిక్షణ పొందుతున్న విద్యార్థినీ విద్యార్థులతో కావలసిన మౌలిక సదుపాయాలు, వివిధ సౌకర్యాలపై కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. శిక్షణ నిమిత్తం వచ్చిన విద్యార్థులకు ఆధునాతన సాంకేతికలో పట్టు సాధించే విధంగా విద్యార్థినీ విద్యార్థులను తీర్చిదిద్దాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఏటీసీలో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ తెలిపారు. ఏటీసీలో ఫర్నిచర్ లేని పరిస్థితిని గ్రహించిన కలెక్టర్ విద్యార్థులకు సరిపోను కుర్చీలను సమకూరుస్తానని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ సందర్శనలో భాగంగా ప్రిన్సిపాల్ నరేంద్ర బాబు, ఏటిసి ఇంచార్జ్ ఎస్.ఎం. సరూప్, ఏటి సిబ్బంది ఉన్నారు.



# అల్ట్రా సౌండ్ యంత్రం స్వాధీనం

## జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ కళావతి బాయి

**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** ఖమ్మం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పి.సి.పి.ఎన్.డి.టి. చట్టం- 1994 ప్రకారం అనధికారికంగా ఉపయోగిస్తున్న పోర్టబుల్ అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రాన్ని స్వాధీనం చేసుకోవడం జరిగిందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ కళావతి బాయి ఒక ప్రకటనలో తెలిపారు. డిప్యూటీ జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ చందు నాయక్, ఖమ్మం అర్బన్ పోలీస్ సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించామని, తనిఖీ సమయంలో హిటాచీ మోడల్ పోర్టబుల్ అల్ట్రాసౌండ్ యంత్రం, ఒక ప్రోబ్, రెండు అల్ట్రాసౌండ్ జెల్ సీసాలను సాక్షుల సమక్షంలో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ యంత్రాలు నిర్దిష్ట అధికార రిజిస్ట్రేషన్ లేకుండా పనిచేస్తున్నట్లు గుర్తించామని, ఇందులో సల్లోజా వెంకటేష్ (వయసు 30, పాండురంగపురం, ఖమ్మం రూరల్), బానోత్ హుస్సేన్ (వయసు 40, వైఎస్సార్ కాలనీ, ఖమ్మం అర్బన్) సంఘటన స్థలంలో ఉన్నారని అన్నారు. తక్షణమే పంచనామా నిర్వహించి, అధికారిక ఫిర్యాదు ఖానాపురం హవేలీ పోలీస్ స్టేషన్ లోపి.సి.పి.ఎన్.డి.టి. ఇతర సంబంధిత చట్టాల ఆధారంగా కేసు నమోదు చేయడం జరిగిందని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారిణి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



## బాబు, మాధవి దంపతుల వివాహానికి హాజరైన

# వి.జగదీశ్వర్ గౌడ్, యలమంచి ఉదయ్ కిరణ్

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** మియాపూర్ న్యూ కాలనీ వాసులు బాబు, మాధవి దంపతుల వివాహ వేడుకకు హాజరై వధూవరుల కుటుంబాల ఆహ్వానం మేరకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ జగదీశ్వర్ గౌడ్, మియాపూర్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు %ఒ% ఛైర్మన్ యలమంచి ఉదయ్ కిరణ్, వీరేంద్ర గౌడ్, మన్నెపల్లి సాంబశివరావు, తాండ్ర రాంచందర్ గౌడ్ లు పలువురు నాయకులు మియాపూర్ న్యూ కాలనీ నివాసులు బాబు, మాధవి దంపతుల వివాహ వేడుకకు హాజరయ్యారు. ఈ వేడుక లింగంపల్లిలోని జె.వి.ఎన్. గార్డెన్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వధూవరులకు పెద్దలు, నాయకులు హృదయపూర్వక అభినందనలు తెలియజేసి, ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఈశ్వర్, ఘౌస్, వంశీ, తులసి, గోకినేపల్లి రమేష్, వంశీ కృష్ణ, రత్నాచారి, సాయి ,సతీష్, వినోద్, కామినేని వాసు, నాగసాయి తదితరులు పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు.

## గొర్రెల లోను పేరుతో

# భారీ ఘరానా మోసం



**ఖమ్మం, రాజముద్ర న్యూస్ :** కృష్ణా జిల్లా తిరువూరు నియోజకవర్గం గ్రామం కందిమల్ల బంజర చెందిన కట్ట శీను మెడికల్ రిప్రజెంట్ చేస్తూ,గొర్రెల లోను, ఇప్పిస్తానంటూ. అగోతు రంగా,రాజు గూడెం చెందిన అతనిని,పరిచయము చేసుకొని అతని తోటి అనుచరులు దగ్గర మాయ మాటలు, చెప్పివారిని, నమ్మబలికించి. దాదాపు 30 మంది దగ్గర ఒక్కొక్కరి నుంచి కనీసం 50 వెయ్యిలు 1.లక్ష 2.లక్షలు తీసుకొని సుమారు 26 లక్షలు వసూలు చేసి అక్కడి నుంచి ఖమ్మంకు పరారయ్యాడు. ఖమ్మంలో అతను నివసించే,ఇంటికి బాధితులు అంగోతు రంగ, భూక్య భువనేశ్వరి, గుగులోత్ తులసిశ, గుగులోత్ తరుణ్,భూక్య జ్యోతి,తేజావత్ కవిత భూక్య రాజేశ్వరి.అంగోతు లక్ష్మి కొమ్ము ప్రేమ్ కుమార్, రాయల నరసింహారావు అన్నెం,నాగిరెడ్డి,భూక్య శంకర్,శారద నిందితుడు ఇంటికి చేరగా నాకు ఖమ్మం లో ఇల్లు ఉంది ఇల్లు అమ్మి మీ డబ్బులు ఇస్తానంటూ నమ్మబలికిస్తూ వాయిదాలు వేసుకుంటూ పబ్బం,గడుపుతున్నాడు. అతనకు ఇల్లు ఉన్నదో లేదో అని బాధితులు రిజిస్టర్ ఆఫీస్ కి వెళ్లి ఈసీ పరిశీలించగా అతను సంవత్సరం కిందట ఇల్లు అమ్మినాడని తెలిసినది. అతనిపై బాధితులు ఆగ్రహించి గొడవ చేయగా వారినుంచి, తప్పించుకొనుటకు మరొకసారి నాకు మేళ్లచెరువులో రెండో ఇల్లు ఉన్నది. అంటూ మారి యొక్కసారి తప్పించుకొనుటకు ప్రయత్నం చేయగా అతని మాయమాటలతో నిరసన చెందిన బాధితులు ఖమ్మం అర్బన్ పోలీస్ స్టేషన్ అతను తీసుకెళ్లగా ఆంధ్ర తిరువూరు నియోజకవర్గం చెందిన అతను కాబట్టి అతనిపై ఆంధ్రాలో ఎఫ్ ఐ ఆర్ చేయండి.అప్పుడు అతనిపై మేము చర్య తీసుకొని ఆంధ్ర పోలీస్ డిపార్ట్మెంట్ వారికి అతను అప్పగిస్తామంటూ. తెలంగాణ పోలీసులు వారికి నచ్చజెప్పి ఎటువంటి గొడవలు జరగకుండా చర్యలు చేపట్టారు.

# రౌడీ షీటర్స్‌పై పటిష్ట నిఘా

- దౌర్జన్యాలకు పాల్పడితే పి.డి యాక్ట్ నమోదు చేస్తాం
- జిల్లా ఎస్పీ నరసింహ






**సూర్యాపేట,రాజముద్ర న్యూస్ :** పోలీసు స్టేషన్ల వార్షిక తనిఖీల్లో భాగంగా సూర్యాపేట జిల్లా ఎస్పి కె. నరసింహ ఐపీఎస్ సూర్యాపేట టూటౌన్ పట్టణ పోలీస్ స్టేషన్‌ను తనికి చేసి స్టేషన్ పరిసరాలను పరిశీలించరు..డీస్పీ ప్రసన్న కుమార్,సి ఐ వెంకటయ్య,ఎస్ ఐ శివతేజ,మహేందర్ నాథ్ ఏఎస్ఐలు,సిబ్బంది ఎస్పి కి స్వాగతం తెలిపినారు. పోలీసు సిబ్బంది కవాతు,పోలీసు పరికరాలు తనిఖీ చేశారు. సిబ్బందితో మాట్లాడి సమస్యలు తెలుసుకుని విధుల నిర్వహణపై సూచనలు అందించారు.పోలీసు స్టేషన్ అవరణంలో మొక్కలు నాటారు.అనంతరం ప్రజలకు అందించే పోలీసు సేవలు,నేరాల నమోదు,పెండింగ్ కేసులు,రోడ్డు ప్రమాదాల నివారణ,సైబర్ మోసాల తీరు, కేసుల దర్యాప్తు, ప్రకృతి వైపరిత్యాలు సమయంలో పోలీసు పని,కేసుల పురోగతి,సీసీ కెమెరాల ఏర్పాటు,మహిళల భద్రతకు తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ,"ప్రజల భద్రత, శాంతి భద్రతల రక్షణలో పటిష్టంగా పని చేస్తున్నాం అన్నారు రౌడీ షీటర్ల పై పటిష్టంగా ఉంచాం ప్రతిరోజు వారి కదలికలను తెలుసుకోవడానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటున్నామని తెలిపారు, ఇతరులపై భౌతిక దాడులకు దౌర్జన్యాలకు పాల్పడితే అలాంటి వారిపై రౌడీ షీట్స్ నమోదు చేసి పిడి యాక్ట్ పెట్టీ జైలుకు పంపడం జరుగుతుందని హెచ్చరించారు. విధులు పట్ల ప్రతి పోలీస్ బాధ్యతాయుతంగా,క్రమశిక్షణతో పని చేస్తున్నారు.ఫిర్యాదులపై వేగంగా స్పందించి,న్యాయం అందించడంలో పారదర్శకంగా పని చేయాలని అన్నారు.పోలీస్ సిబ్బందికి ప్రేరణ కలిగిస్తూ,నైతిక విలువలతో కూడిన సేవను ప్రజలకు అందించాలని సూచించారు. ప్రతి ఫిర్యాదు పై వేగంగా స్పందించడానికి బ్లూ కోట్, పెట్రో కార్, డయల్ 100 సిబ్బంది సామర్థ్యంతో పనిచేస్తున్నారు. మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత విధిస్తూ షీ టీం బృందాలు జిల్లా కేంద్రంలో నిత్యం నిఘాలో ఉన్నాయి ఆకతాయి పనులకు పాల్పడుతున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేయడం కౌన్సిలింగ్ చేయడం చేస్తున్నాము, రోడ్డు భద్రత చర్యల అదృష్ట నూతన ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాము అలాగే జిల్లా కేంద్రంలో వాహనాల రద్దీ ప్రజల అవసరాలకు అనుగుణంగా ట్రాఫిక్ ను పునరుద్ధరిస్తున్నాము అన్నారు జిల్లా కేంద్రంలో ఎక్కువగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి నేను సైతం కార్యక్రమం ద్వారా కమ్యూనిటీ కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని.తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్న కుమార్,సీఐ వెంకటయ్య,ఎస్ఐ శివ తేజ,మహేంద్ర నాథ్,స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు,డి సి ఆర్ బి ఇన్స్పెక్టర్ హరిబాబు,ఆర్ ఎస్ ఐ అశోక్, ఏ ఎస్ ఐ అంజన్ రెడ్డి, సీసీ సందీప్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# రష్యా చమురే భారత్‌కు ఆధారం కాదు


## ట్రంప్ సలహాదారు కీలక వ్యాఖ్యలు




**యూఎస్ :** న్యూయార్క్: రష్యా నుంచి కొనుగోలు చేసే చమురే భారత ఆర్థిక వ్యవస్థకు ఆధారం కాదని అమెరికా వాణిజ్య ప్రతినిధి, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సలహాదారు జెమీసన్ గ్రీర్ అన్నారు. అయినా ఇప్పటికే భారత్ తన చమురు కొనుగోళ్లను మాస్కో నుంచి మళ్లిస్తోందని తెలిపారు. న్యూయార్క్‌లో జరిగినది ఎకనామిక్ క్లబ్‌లో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు."రష్యాతో భారత్‌కు బలమైన సంబంధాలు ఉన్నాయి. కానీ, గతంలో ఎన్నడూ ఈ స్థాయిలో మాస్కో నుంచి చమురును కొనుగోలు చేయలేదు. డిస్కౌంట్ ధరల కారణంగా గత రెండు, మూడేళ్ల నుంచి రష్యా చమురును ఎక్కువగా కొంటోంది. ఇది కేవలం వినియోగం కోసం మాత్రమే కాదు.. ఆ చమురును శుద్ధి చేసి రీసేల్ చేస్తున్నారు. దీన్ని బట్టి చూస్తే భారత ఆర్థిక వ్యవస్థకు రష్యా చమురు కొనుగోళ్లు ఒక్కటే బలమైన ఆధారం కాదని అర్థమవుతోంది. అందుకే వారు ఇతర దేశాల నుంచి కొనుగోలు చేయాలని సూచిస్తున్నాం. దీన్ని అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాం. ఇప్పటికే వారు ఈ విషయంలో వైవిధ్యభరిత చర్యలు ప్రారంభించడం మేం చూస్తున్నాం" అని గ్రీర్ పేర్కొన్నారు. ఇక, భారత్ సార్వభౌమత్వ దేశమని ట్రంప్ సలహాదారు అన్నారు. ఆ దేశం సొంత నిర్ణయాలు తీసుకోగలదని తెలిపారు. "ఇతర దేశాలు ఎవరితో సంబంధాలు కొనసాగించాలి.. ఎవరితో కొనసాగించకూడదు అనేది మేం చెప్పాలనుకోవడం లేదు. ఈ విషయంలో మేం ఎవర్నీ శాసించడం లేదు" అని గ్రీర్ తెలిపారు. ఈ సందర్భంగా రష్యా చమురు కొనుగోలు చేస్తుందన్న కారణంతో భారత్‌పై ట్రంప్ విధించిన సుంకాల గురించి కూడా ఆయన ప్రస్తావించారు. "అమెరికాతో వాణిజ్యం కారణంగా భారత్‌కు 40 బిలియన్ డాలర్లకు పైగా మిగులు ఉంటోంది. మేం వారికి విక్రయించే దానికంటే.. భారత్ మాకు అమ్మేవే ఎక్కువ. అయితే, రష్యా చమురును కొనుగోలు చేయడంతో ఉక్రెయిన్‌పై యుద్ధానికి పుతిన్‌కు న్యూదిల్లీ వనరులను అందించినట్లవుతోంది. మాస్కోపై ఒత్తిడి తెచ్చేందుకే భారత్‌పై ఈ స్థాయిలో సుంకాలు విధించాల్సి వచ్చింది. అయితే, టారిఫ్‌ల విషయంలో అమెరికాతో ఆ దేశం గొప్ప డీల్ చేసుకుంటోంది" అని గ్రీర్ వెల్లడించారు.

# కరూర్ తొక్కిసలాట ఘటన

## సుప్రీంకోర్టుకు విజయ్



**న్యూఢిల్లీ :** టీవీకే చీఫ్ విజయ్ బుధవారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కరూర్ తొక్కిసలాట ఘటనపై సిట్ దర్యాప్తునకు మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వును ఆయన అత్యున్నత న్యాయస్థానంలో సవాల్ చేశారు. పార్టీకి వ్యతిరేకంగా సిట్ పక్షపాత వైఖరిని అవలంబిస్తోందని ఆరోపించారు. సీనియర్ ఐపీఎస్ అధికారి అస్రాగార్గ్ ఆధ్వర్యంలో సిట్ ఏర్పాటైంది. పోలీసుల దర్యాప్తు, అధికారుల పాత్రపై తాము ఇదివరకే ప్రశ్నలు లేవనెత్తినప్పటికీ.. రాష్ట్ర పోలీసు అధికారులతోనే మద్రాస్ హైకోర్టు సిట్‌ను ఏర్పాటు చేసిందని టీవీకే తన పిటిషన్‌లో పేర్కొంది. తమ పార్టీపై సిట్ పక్షపాతంతో వ్యవహరిస్తోందని ఆరోపించారు. టీవీకే అధ్యక్షుడు విజయ్‌కు నాయకత్వ లక్షణాల్లేవని, ఘటన జరిగిన వెంటనే ఆ పార్టీ నేతలందరూ పారిపోయారని వ్యాఖ్యానించిన మద్రాసు హైకోర్టు... కరూర్ ఘటనపై ఆ పార్టీ తీరును తీవ్రంగా ఖండించిన సంగతి తెలిసిందే. తొక్కిసలాట తర్వాత అన్ని పార్టీలూ సహాయక చర్యలు చేపడితే, నిర్వాహకులు వెళ్లిపోయారని తప్పుపట్టిన సంగతి తెలిసిందే. ఈవిషయాన్ని టీవీకే పార్టీ తన పిటిషన్‌లో ప్రస్తావించింది. ఆ వ్యాఖ్యలు ఇప్పటికే దర్యాప్తును ప్రభావితం చేశాయని పేర్కొంది. తన ర్యాలీలో ఇబ్బందులు సృష్టించేందుకు ముందస్తు కుట్రలను తోసిపుచ్చలేమని ఆరోపించింది. టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ కరూర్‌లో నిర్వహించిన ప్రచార ర్యాలీ తీవ్ర విషాదాన్ని నింపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాలను కలిసేందుకు తనకు అనుమతివ్వాలంటూ డీజీపీకి విజయ్ మెయిల్ పంపారు. విషాదంలో ఉన్న బాధిత కుటుంబాలను స్వయంగా కలిసి పరామర్శించాలని కోరుకుంటున్నట్లు అందులో పేర్కొన్నారు. దీనికిముందు ఆయన బాధిత కుటుంబాలతో వీడియో కాల్‌లో మాట్లాడారు. మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చిన ఆయన.. త్వరలోనే వారివద్దకు వస్తానని హామీ ఇచ్చారు. ఈ ఘటనలో విజయ్ తప్పులేదని, ఆయన తన రాజకీయ ప్రయాణాన్ని కొనసాగించాలని వారు కోరారని టీవీకే నేత అరుణ్ రాజ్ వెల్లడించారు. ఇదిలాఉంటే.. తొక్కిసలాటలో మృతి చెందిన 13 ఏళ్ల బాలుడి తండ్రి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసును సీబీఐకి అప్పగించాలని కోరారు.



## నేతాజీ నగర్ కాలనీలో పలు సమస్యలపై

# గంగాధర్ రెడ్డికి వినతి పత్రం

**శేరిలింగంపల్లి, రాజముద్ర న్యూస్:** గచ్చిబౌలి డివిజన్ నేతాజీ నగర్ కాలనీలో నెలకొన్న సమస్యలు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిసి రోడ్లు శానిటేషన్ సిబ్బంది కొరత వల్ల కాలనీలో పలు ప్రదేశాల్లో చెత్త చెదారం పేర్కొంది. వీధిలైట్లు డ్రైనేజీ ఔట్లెట్ లేక మురుగునీరు కాలనీలో నిలబడి దుర్వాసన వస్తుంది. దీని వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కాలనీలోని సమస్యలపై గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది అని అన్నారు కాలనీ అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్. కాలనీ అధ్యక్షులు రామచంద్ర యాదవ్, సాయిబాబా ఆలయ ప్రధాన అర్చకులు, జోషి రాఘవేంద్ర శర్మ, చిట్టెమ్మలాల్ రెడ్డి, జయ రెడ్డి, రాధా రాణి రెడ్డి, అసోసియేషన్ సభ్యులు వినతిపత్రం అందించారు కాలనీలో ఉన్న సమస్యలు త్వరగా పరిష్కరణ పరిష్కరించాలని విన్నవించుకున్నారు. కాలనీలో ఉన్న సమస్యలన్నీ పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ హామీ ఇవ్వడం జరిగింది. ఈ సమస్యలపై సానుకూలంగా స్పందించిన కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేసిన కాలనీ అధ్యక్షులు రామచంద్ర యాదవ్ అసోసియేషన్ సభ్యులు.




# ఓటు చోర్ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

## టిపీసీసీ ఉపాధ్యక్షుడు : బండి రమేష్ ప్రజలకు

**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్:** కేంద్రంలోని బీజేపీ పాలిత ప్రాంతాలలో ఓటు చోర్ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్రంలోని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని టిపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఏఐసిసి అగ్రనాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు ఓట్ చోర్ కార్యక్రమంపై తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు కల్పించే ఉద్దేశంతో బుధవారం మేడ్చల్ జిల్లా పార్టీ కార్యాలయంలో అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ఇన్చార్జిలతో పాటు యూత్ కాంగ్రెస్ నాయకులు, బ్లాక్ అద్యక్షులు, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ పార్టీ నేతలు, కార్యకర్తలు బలంగా ఉంటేనే ప్రభుత్వం బాగుంటుందని, తద్వారా సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు అమలు జరుగుతాయన్నారు.



# మెడికల్ సీటు సాధించిన విద్యార్థినికి సన్మానం

## అక్షరను అభినందించిన ఎస్.సి, ఎస్.టి. కమిషన్ ఛైర్మన్ వెంకటయ్య

**హైదరాబాద్, రాజముద్ర న్యూస్:** నగరానికి చెందిన యాతాకుల అక్షర మెడికల్ రెండవ దశ నీట్ కౌన్సిలింగ్‌లో ఎంబీబీఎస్ సీటు సాధించి కుటుంబానికి గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా ఎస్.సి, ఎస్.టి కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య తన కార్యాలయంలో అక్షరను సన్మానించి, ఆమె తల్లిదండ్రులైన అశోక్ – ఉపేంద్రలను అభినందించారు. అక్షరను భవిష్యత్తులో సమాజానికి, ముఖ్యంగా పేదలకు సేవ చేయగల డాక్టర్‌గా తీర్చిదిద్దాలని సూచించారు. అక్షర తల్లిదండ్రుల కల నిజమవుతున్నందుకు సంతోషం వ్యక్తం చేసిన వెంకటయ్య, ఆమె మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. మల్లారెడ్డి వైద్య కళాశాలలో మెడికల్ సీటు సాధించిన అక్షర ను యూసఫ్ బాబు, జగదీశ్వర్ రెడ్డి, గుండం రాజా మహేందర్ రెడ్డి, అన్నారెడ్డి కృష్ణారెడ్డి తదితరులు, బంధువులు, స్నేహితులు అభినందించారు.

# భారత్‌తో యుద్ధం జరిగే అవకాశం

## పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్



**పాకిస్థాన్ :** ఆపరేషన్ సిందూర్‌తో భారత్ దెబ్బను రుచి చూసినా.. పాకి స్థాన్ ప్రగల్బాలు మాత్రం ఆపట్లేదు. తాజాగా ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మాట్లాడుతూ.. భారత్‌తో మళ్లీ యుద్ధం జరిగే అవకాశాలను తోసిపు చ్చలేమన్నారు. అయితే, ఈసారి యు ద్ధం వస్తే తాము అనుకూల ఫలితాలు సాధిస్తామంటూ బీరాలు పలికారు. పాక్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఖవాజా ఆసిఫ్ ఈ వ్యాఖ్యలు చేశారు. "నేను ఉద్రిక్తతలను కోరుకోవట్లేదు. కానీ, ముప్పు పొంచి ఉన్నమాట వాస్త వం. భారత్‌తో యుద్ధం అవకాశాలను కొట్టిపారేయలేం. కానీ, ఈసారి యు ద్ధం జరిగితే.. గతంలో కన్నా మెరుగైన ఫలితాలు సాధిస్తాం" అంటూ రెచ్చగొట్టేలా మాట్లాడారు. సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోన్న పాక్‌కు ఇటీవల భారత్ ఆర్మీ చీఫ్ గట్టి వార్నింగ్ ఇచ్చిన సంగతి తెలిసిందే. దానికి బదులిస్తూనే ఖవాజా ఈ విధంగా కవ్వింపు లకు పాల్పడ్డారు. ఇటీవల భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది మాట్లాడుతూ.. "భారత్ పూర్తి సన్నద్ధంగా ఉంది. ఆపరేషన్ సిందూర్ 1.0లో మాదిరిగా ఈసారి సహనం ప్రదర్శిం చబోం. పాక్ ప్రపంచపటంలో ఉండాలనుకుంటే సీమాంతర ఉగ్రవాదాన్ని ఆపి తీరాల్సిందే. లేదంటే ఆ దేశాన్ని చరిత్ర నుంచి తుడిచిపెట్టాల్సి వస్తుంది జాగ్రత్త" అని జనరల్ ద్వివేది గట్టిగా హెచ్చరించారు. అంతేగాక, ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలని సైనికులను ఆదేశిం చారు. "పూర్తి సన్నద్ధంగా ఉండండి. దేవుడు వాంఛిస్తే ఆ అవకాశం త్వరలోనే మనకు వస్తుంది" అని భారత జవాన్లకు ఆయన పిలుపునిచ్చారు.

# పసిడి సరికొత్త రికార్డ్..

## రూ.1.25 లక్షల్ని దాటేసి ఇంకా పైపైకి



బంగారం ధర రోజుకో సరికొత్త రికార్డును నమోదు చేస్తోంది. మొన్నటి వరకు 10 గ్రాముల ధర రూ.లక్ష దాటితేనే ఔరా అనుకున్న వాళ్లంతా.. తాజాగా రూ.1.25 లక్షలకు చేరుకోవడం చూసి ముక్కున వేలేసుకు ంటున్నారు. అంతర్జాతీయంగానూ పుత్తడి ఔన్సు తొలిసారి 4వేల డాలర్ల మార్కును దాటింది. అమెరికా ఫెడరల్ గవర్నమెంట్ షట్‌డౌన్, ఆ దేశ ఆర్థిక పరిస్థితిపై నెలకొన్న అనిశ్చితులు పసిడికి తాజాగా డిమాండ్ పెంచుతున్నాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో బుధవారం మ ధ్యాహ్నం 12 గంటల సమయానికి 24 క్యారెట్ల స్వచ్ఛమైన 10 గ్రాముల బంగారం ధర రూ.1,25,780 వద్ద కొనసాగుతోంది. 22 క్యారెట్ల పసిడి 1,12,900 పలుకుతోంది. అటు వెండి సైతం కిలో రూ.1.56 లక్షలు దాటింది. అంతర్జాతీయ విపణిలో స్పాట్ గోల్డ్ ఔన్సు 4034 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. వెండి ఔన్సు 48.62 డాలర్ల వద్ద కొనసాగు తోంది. డాలరుతో రూపాయి మారకం విలువ 88.79గా ఉంది.






# నష్టాల్లో ముగిసిన సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఉదయం లాభాల్లో ప్రారంభమైన సూచీలు.. రోజంతా ఒడుదొడుకులు ఎదుర్కొని చివరికి నష్టాలకు పరిమితమయ్యాయి. దీంతో సూచీల నాలుగు రోజుల వరుస లాభాలకు బ్రేక్ పడింది. క్యూ2 ఫలితాల సీజన్ త్వరలో ప్రారంభం కానుండడం, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాల నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తత పాటించారు. ఐటీ, కన్స్యూమర్ డ్యూరబుల్ షేర్లు మినహా మిగిలిన అన్ని రంగాల షేర్లు నష్టాలు చవిచూశాయి. సెన్సెక్స్ ఉదయం 81,899.51 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,926.75) స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. కాసేపటికే మళ్లీ లాభాల్లోకి వచ్చింది. ఈ క్రమంలోనే 82,257.74 వద్ద గరిష్ఠాన్ని తాకింది. కాసేపటికే మళ్లీ నష్టాల్లోకి జారుకుంది. ఇలా రోజంతా ఒడుదొడుకులు ఎదుర్కొన్న సూచీ.. చివరికి 153.09 పాయింట్ల నష్టంతో 81,773.66 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 62.15 పాయింట్ల నష్టంతో 25,046.15 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 88.80గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, బీఈఎల్, అల్ట్రాటెక్ సిమెంట్, ట్రెంట్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. టైటాన్, ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 66.16 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔనసు 4043.76 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# ఎస్ఎంఈలకు నిమిషాల్లోనే రూ.5 కోట్ల వరకు రుణం: ఎస్‌బీఐ ఛైర్మన్



**ముంబయి:** భారత్‌లోని డిజిటలీకరణ ఫైనాన్షియల్ సెక్టార్ రూపురేఖలనే మార్చివేసిందని ఎస్‌బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి అన్నారు. దీనివల్ల చిన్న, మధ్యతరహా సంస్థలకు కొన్ని క్షణాల్లోనే రుణం అందుతోంద న్నారు. డిజిటల్ వ్యవస్థల కారణంగా కేవలం 25-26 నిమిషాల్లో ఎస్ఎం ఈలకు రూ.5 కోట్ల వరకు రుణానికి ఆమోదం లభిస్తోందని పేర్కొన్నారు. ఇది గర్వించదగ్గ విషయం అని చెప్పారు. ఈ మేరకు గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2025 ఈవెంట్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. డిజిటలీకరణ వల్ల ఇన్సూరెన్స్ వంటి ఆర్థిక ఉత్పత్తుల వినియోగం పెరిగిందని శ్రీనివాసులు శెట్టి పేర్కొన్నారు. యూపీఐ ద్వారా జారీ చేసే రుణాలకు సంబంధించి బ్యాంకులు తమ కలెక్షన్ సామర్థ్యాలను పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఒక్క ఎస్‌బీఐ ద్వారా 15 కోట్ల జన్‌ధన్ జీరో బ్యాలెన్స్ ఖాతాలు తెరిచినట్లు చెప్పారు. అందులో 99.5 శాతం ఖాతాల్లో నిల్వలు ఉన్నాయన్నారు. సగటున రూ.4వేలు చొప్పున ఒక్కో బ్యాంకు ఖాతాలో నగదు ఉందని, ఈ ఖాతాల ద్వారా రోజుకు 35 లక్షల లావాదేవీలు జరుగుతున్నాయన్నారు. ఈ ఖాతాలు 56 శాతం మహిళలవే అని పేర్కొన్నారు. చాలా మంది జీరో బ్యాలెన్స్ ఖాతాలతో ప్రారంభమై.. కరెంట్ ఖాతాలు తెరిచే స్థాయికి చేరిన వాళ్లు ఉన్నారని చెప్పారు. అంతగా బ్యాంకింగ్ వ్యవస్థలు నిత్యజీవితంలో భాగమైందన్నారు. త్వరలో యోనో యాప్‌ను అప్‌గ్రేడ్ చేయనున్నట్లు శ్రీనివాసులు శెట్టి వివరించారు. ఇందుకోసం 12 ఫిన్‌టెక్ సంస్థలతో పనిచేస్తున్నట్లు తెలిపారు. మొబైల్ బ్యాంకింగ్ మాత్రమే కాకుండా మరిన్ని సదుపాయాలు ఇందులో అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. యోనో యాప్ వల్ల కొత్త కస్టమర్‌ను చేర్చుకోవడానికి ఒకప్పుడు గంట పట్టే సమయం 15 నిమిషాలకు తగ్గింద న్నారు. కేవైసీ నిబంధనలను మరింత సరళతరం చేయాల్సిన అవసరం ఉ ందని ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. ఇందుకోసం ప్రభుత్వం, నియంత్రణ సంస్థలను ఎస్‌బీఐ సంప్రదిస్తోందని శ్రీనివాసులు శెట్టి వివరించారు.



# టెస్టు ర్యాంకింగ్స్..

## సిరాజ్, జడేజాకు కెరీర్‌లో అత్యుత్తమ రేటింగ్ పాయింట్లు

భారత క్రికెటర్లు మహ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజా తమ కెరీర్‌లో అత్యుత్తమ టెస్టు రేటింగ్ పాయింట్లు అందుకున్నారు. వెస్టిండీస్‌తో జరిగిన తొలి టెస్టులో అదరగొట్టిన వీరిద్దరూ బుధవారం ఐసీసీ ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో గణనీయంగా స్థానాలను మెరుగుపర్చుకున్నారు. విండీస్‌తో మొదటి టెస్టులో రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి ఏడు వికెట్లు పడగొట్టిన సిరాజ్ (718 పాయింట్లు) మూడు స్థానాలు ఎగబాకి 12వ స్థానానికి చేరుకున్నాడు. ఈ హైదరబాదీ పేసర్‌కు టెస్టు కెరీర్‌లో అత్యుత్తమ రేటింగ్ పాయింట్లు ఇవే. జస్‌ప్రీత్ బుమ్రా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ ఏడు స్థానాలు ఎగబాకి 21 ర్యాంకులో నిలిచాడు. సీనియర్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా (644 పాయింట్లు) బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో కెరీర్‌లో ఉత్తమ రేటింగ్ పాయింట్లు అందుకున్నాడు. జడ్డూ ఆరు స్థానాలు మెరుగై 25వ స్థానానికి ఎగబాకాడు. విండీస్‌పై జడేజా తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ (104) చేసిన సంగతి తెలిసిందే. ఇదే మ్యాచ్‌లో శతకం (100) బాదిన కేఎల్ రాహుల్ నాలుగు స్థానాలు జంప్ అయి 35 స్థానానికి చేరుకున్నాడు. ఈ విభాగంలో ఇంగ్లాండ్ ఆటగాడు జో రూట్ నంబర్ వన్ ర్యాంక్‌లో కొనసాగుతుండగా.. యశస్వి జైస్వాల్ రెండు స్థానాలు దిగజారి ఏడో ర్యాంక్‌కు పడిపోగా.. రిషభ్ పంత్, శుభ్‌మన్ గిల్ వరుసగా 8, 13 స్థానాల్లో ఉన్నారు. ఆల్‌రౌండర్ల విభాగంలో జడేజా టాప్‌లో ఉండగా. వాషింగ్టన్ సుందర్ నాలుగు స్థానాలు మెరుగై 11 స్థానంలో నిలిచాడు.



# ఆస్ట్రేలియా క్రికెట్‌ను వదిలేస్తే చెరో రూ.58 కోట్లు..

## ఐపీఎల్ ఫ్రాంచైజీ ఆఫర్

సోషల్ మీడియాతోపాటు క్రికెట్ వర్గాల్లో ఓ వార్త చక్కర్లు కొడుతోంది. ఆస్ట్రేలియా కెప్టెన్‌తోపాటు ఆ జట్టు డేంజరస్ బ్యాటర్‌కు ఓ ఐపీఎల్ ఫ్రాంచైజీ భారీ మొత్తం ఆఫర్ చేసిందని.. అందుకోసం ఓ షరతు విధించినట్లు కథనాలు వస్తున్నాయి. ఇంతకీ ఆ ఆటగాళ్లు ఎవరు? ఆఫర్ ఏంటో ఓ లుక్కేద్దాం... ఆస్ట్రేలియా టెస్టు జట్టు సారథి పాట్ కమిన్స్, ఓపెనర్ ట్రావిస్ హెడ్‌కు ఐపీఎల్‌కు చెందిన ఓ ఫ్రాంచైజీ రూ. 58 కోట్లు (10 మిలియన్ ఆస్ట్రేలియా డాలర్లు) చొప్పున ఇచ్చేందుకు ఆఫర్ చేసింది. అయితే, ఆ మొత్తం అందుకోవాలంటే ముందు ఆస్ట్రేలియా క్రికెట్ నుంచి బయటకు రావాల్సి ఉంటుంది. కేవలం ఐపీఎల్‌లో మాత్రమే కాకుండా.. తమ ఫ్రాంచైజీకి చెందిన జట్ల తరఫున ఇతర టీ20 లీగుల్లోనూ ఆడాల్సిఉంది. జాతీయ జట్టు తరఫున ఆడకుండా.. ఫ్రాంచైజీకి వస్తున్నందుకే ఇంత భారీ మొత్తం చెల్లించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఏడాది పొడవునా లీగులు ఉండటంతో ఫ్రాంచైజీకీ ఆ ధర బాగానే వర్కౌట్ అవుతుందనేది క్రికెట్ వర్గాల అంచనా. అయితే, వారిద్దరూ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని సమాచారం. దీనిపై క్రికెట్ ఆస్ట్రేలియా, రాష్ట్రాల క్రికెట్ సంఘాలు, ప్లేయర్ల యూనియన్‌లోనూ చర్చించాల్సి ఉంది.

### ఇప్పటి వరకు ఎంత వస్తుందంటే?

ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ప్రాతినిధ్యం వహిస్తోన్న పాట్ కమిన్స్‌ను ఏడాదికి రూ.18 కోట్లకు రిటైన్ చేసుకుంది. ప్రస్తుతం అతడే ఎస్ఆర్‌హెచ్ కెప్టెన్ అనే సంగతి తెలిసిందే. ఇక క్రికెట్ ఆస్ట్రేలియా నుంచి ఏడాదికి కాంట్రాక్ట్ రూపంలో రూ. 8.74 కోట్లు వస్తాయి. ప్రస్తుతం అతడు టెస్టు, వన్డేలకు సారథిగా ఉన్నాడు. తమ జాతీయ బోర్డు నుంచి అన్నీ కలుపుకొని రూ. 17.50 కోట్ల వరకూ వస్తాయి. ఇతర ఫ్రాంచైజీల్లోనూ ఆడినప్పటికీ ఇంత మొత్తం రాదు. ఐపీఎల్‌తో వచ్చే ఆదాయం కలిపి సుమారు రూ. 35 నుంచి 40 కోట్ల వరకూ అందుతాయి. ట్రావిస్ హెడ్ విషయంలో ఈ మొత్తం కాస్త తక్కువగానే ఉంటుంది. ఎందుకంటే ఎస్ఆర్‌హెచ్ అతడిని రూ. 14 కోట్లకు రిటైన్ చేసుకుంది. సెంట్రల్ కాంట్రాక్ట్ కారణంగా క్రికెట్ ఆస్ట్రేలియా నుంచి రూ. 8.70 కోట్లు వస్తాయి. ఇతర లీగుల్లోనూ ఆడినప్పటికీ ఈ మాత్రం మొత్తం రాదు. ఏడాదికి ట్రావిస్ హెడ్ సుమారుగా రూ. 25 కోట్ల నుంచి 30 కోట్ల వరకూ తీసుకుంటాడు. ఇప్పుడు ఆ ఐపీఎల్ ఫ్రాంచైజీ ఇస్తామన్న రూ.58 కోట్ల ఆఫర్ కమిన్స్‌తో పోలిస్తే హెడ్‌కే ఎక్కువ బెనిఫిట్ అవుతుంది.

# యువ క్రికెటర్లకే పోటీనిచ్చేలా రోహిత్

## మరో నాలుగేళ్లు ఆడేంత 'నాజూగ్గా'



కొన్ని రోజుల కిందట వరకూ రోహిత్ శర్మను చూసినవారు 'వచ్చే వన్డే ప్రపంచ కప్' వరకూ ఫిట్‌నెస్‌ను కాపాడుకోవడం కష్టం అనుకొనేవారు. తాజాగా అతడి పిక్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారిపోయాయి. దానికి కారణం 'స్లిమ్'గా మారి యువ క్రికెటర్లకే పోటీనిచ్చేలా ఉండటం. ఇప్పుడు అతడిని చూస్తే 38 ఏళ్ల క్రికెటర్‌లా అస్సలు కనిపించడు. ఇవేవో 'ఏఐ' జనరేటెడ్ ఫొటోలు అనడానికీ వీల్లేదు. ఎందుకంటే కెప్టెన్సీ పోయాక తొలిసారి రోహిత్ ఓ కార్యక్రమంలో పాల్గొనడం.. ఛాంపియన్స్ ట్రోఫీపై మాట్లాడటం తెలిసిందే.

### అవన్నీ తప్పని రుజువు చేస్తూ..

ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌కు జట్టును ప్రకటించే క్రమంలో రోహిత్ శర్మ స్థానంలో శుభ్‌మన్ గిల్‌ను మేనేజ్‌మెంట్ సారథిగా నియమించింది. రోహిత్‌కు టీమ్‌లో ప్లేస్ అయితే ఉంది కానీ కెప్టెన్సీ మాత్రం లేదు. దీనిపై సోషల్ మీడియాలో విపరీతంగా విమర్శలు వచ్చాయి. విలేకర్ల సమావేశంలోనూ అజిత్ అగార్కర్ స్పందిస్తూ 'భవిష్యత్తును దృష్టిలోపెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నాం' అని చెప్పాడు. అంటే వన్డే ప్రపంచకప్ 2027 టోర్నీ నాటికి రోహిత్‌కు 40 ఏళ్లు వస్తాయి. అలాంటప్పుడు అతడికే సారథ్యం కొనసాగిస్తే 'ఫిట్‌నెస్' సమస్య ఎదురైనప్పుడు అప్పటికప్పుడు కొత్త కెప్టెన్‌ను తయారుచేయడం కష్టమనే వాదనా బీసీసీఐ నుంచి వచ్చింది. ఇప్పుడు రోహిత్‌ను చూసిన ప్రతిఒక్కరూ కూడా 'రెండేళ్లు ఏంటి నాలుగేళ్లైనా సరే ఆడేలా ఉన్నాడు' అంటూ కామెంట్లు చేస్తున్నారు. సియట్ క్రికెట్ అవార్డుల కార్యక్రమంలో రోహిత్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు.

### బరువు తగ్గి..

కేవలం వన్డేల్లో కొనసాగుతూ 2027 ప్రపంచ కప్ నెగ్గడమే లక్ష్యంగా ఉన్న రోహిత్ శర్మకు ఫిట్‌నెస్ సాధించడమే పెద్ద సవాల్. మరో సీనియర్ విరాట్ కోహ్లీకి ఈ విషయంలో సమస్యే లేదు. అతడు ఎప్పుడూ వర్కౌట్లు చేస్తూ బిజీగానే ఉంటాడు. రోహిత్ చూసేందుకు కాస్త లావుగా ఉన్నప్పటికీ ఆ ప్రభావం మైదానంలో కనిపించదు. ఫీల్డింగ్‌లోనూ మెరుపులు మెరిపిస్తుంటాడు. బ్యాటింగ్‌లోనూ అతడి 'హిట్టింగ్' ఏ స్థాయిలో ఉంటుందో ప్రత్యర్థులకు ఎరుకే. భారత మాజీ కోచ్ అభిషేక్ నాయర్ నేతృత్వంలో దాదాపు 10 కేజీలు తగ్గిన రోహిత్.. ఇప్పుడు మరింత నాజూగ్గా మారిపోయాడు. ఇప్పటికే బీసీసీఐ ఫిట్‌నెస్ టెస్టులను పాసైన సంగతి తెలిసిందే. అందుకే, ఆసీస్‌తో వన్డే సిరీస్‌కు ఎంపిక చేసినట్లు అజిత్ అగార్కర్ చేసిన వ్యాఖ్యలూ రోహిత్ కష్టానికి ప్రతిఫలం.

### ఆ రికార్డులపై కన్నేసిన రోహిత్..

వన్డే ప్రపంచకప్ 2027 వరకూ తాను అందుబాటులో ఉంటానని చెప్పాలంటే.. ఇప్పుడు ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌ను రోహిత్ సద్వినియోగం చేసుకోవాలి. మెగా టోర్నీ నాటికి మహాఅయితే ఓ పాతిక వన్డేలను మాత్రమే ఆడే అవకాశం ఉంది. సునీల్ గావస్కర్ 'మ్యాచ్ ప్రాక్టీస్ కావాలంటే రంజీల్లోనూ ఆడాలి' చెప్పిన మాటలను కూడా ఆచరిస్తే రోహిత్‌కు అవకాశం ఇవ్వకుండా బీసీసీఐ తప్పించుకోలేదు. ఆస్ట్రేలియాపై ఆడేందుకు రోహిత్ కూడా ఆసక్తిగా ఎదురు చూస్తున్నాడు. అక్టోబర్ 19 నుంచి వన్డే సిరీస్ మొదలుకానుంది. ఈక్రమంలో అతడి ముందు ఆరు రికార్డులు ఉన్నాయి. ఓ అరుదైన ఘనత సాధించే అవకాశమూ ఉంది.

- ఇప్పటివరకు భారత్ తరఫున కేవలం నలుగురు మాత్రమే 500 కంటే ఎక్కువ అంతర్జాతీయ మ్యాచులు ఆడిన ప్లేయర్లు ఉన్నారు. సచిన్ (664), విరాట్ (550), ధోనీ (535), రాహుల్ ద్రవిడ్ (504). ఇప్పుడీ జాబితాలోకి రోహిత్ (499) వచ్చే అవకాశం ఉంది.
- మరో ఎనిమిది సిక్స్‌లు కొడితే వన్డేల్లో అత్యధిక సిక్స్‌లు బాదిన క్రికెటర్‌గా రోహిత్ అవతరిస్తాడు. ప్రస్తుతం రోహిత్ 344 సిక్స్‌లతో ఉండగా.. షాహిద్ అఫ్రిది (351) అందరికంటే ముందున్నాడు. మరో 12 సిక్స్‌లు కొడితే ఆసీస్‌పై అత్యధిక సిక్స్‌లు బాదిన క్రికెటర్ అవుతాడు.
- ఆసీస్‌పై మరో 10 పరుగులు చేస్తే వెయ్యి రన్స్ చేసిన భారత బ్యాటర్‌గానూ రోహిత్ మారతాడు. ఇప్పటివరకు 19 మ్యాచుల్లో 990 పరుగులు రాబట్టాడు. ఈ సిరీస్‌లో రెండు సెంచరీలు చేస్తే.. ఆసీస్‌పై అత్యధిక శతకాలు బాదిన బ్యాటర్‌గా రోహిత్ నిలుస్తాడు. ప్రస్తుతం సచిన్ (9) తర్వాత రోహిత్ (8) ఉన్నాడు. విరాట్ కోహ్లీ (8) కూడా ఈ రేసులో ఉండటం గమనార్హం. రోహిత్ కనీసం ఒక్క సెంచరీ చేసినా ఆసీస్‌పై అత్యధికంగా మూడంకెల స్కోరు చేసిన బ్యాటర్‌గానూ నిలుస్తాడు.
- వన్డేల్లో మరో 54 పరుగులు చేస్తే భారత్ తరఫున అత్యధిక పరుగులు చేసిన మూడో బ్యాటర్‌గా రోహిత్ అవతరిస్తాడు. 273 మ్యాచుల్లో 11,168 పరుగులు చేసిన రోహిత్.. నాలుగో స్థానంలో ఉన్నాడు. సచిన్ (18,426), విరాట్ (14,181), సౌరభ్ గంగూలీ (11,221) మాత్రమే ముందున్నారు. ఆసీస్‌తో మూడు వన్డేల్లోనూ సెంచరీలు చేస్తే అంతర్జాతీయంగా అన్ని ఫార్మాట్లలో కలిపి 20వేల పరుగుల మైలురాయిని అందుకొంటాడు. ప్రస్తుతం 499 మ్యాచుల్లో 19,700 పరుగులు చేశాడు.

# ట్రంప్ కరెక్టే.. అయినా భరిస్తాం

## హెచ్-1బీ ఫీజు పెంపుపై ఎన్విడియా



హెచ్-1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయంపై ఇంకా గందరగోళం కొనసాగుతూనే ఉంది. ఈ ఫీజు పెంపు సరైందేనని ఇప్పటికే పలువురు టెక్ నిపుణులు సమర్థించారు. తాజాగా చిప్ దిగ్గజం ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్ కూడా ట్రంప్‌నకు తన మద్దతును పునరుద్ఘాటించారు. అయినప్పటికీ తాము ఫీజుల విషయంలో వెనకడుగు వేయబోమని, ఈ వీసాల స్పాన్సరింగ్ కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు తన ఉద్యోగులకు హువాంగ్ సందేశం పంపినట్లు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. "ఎన్విడియాలో చాలామంది వలసదారులు పనిచేస్తున్నారు. అమెరికా లో మనకు దొరికిన అవకాశాలు మన జీవితాలను ఎంతగానో తీర్చిదిద్దాయని నేను విశ్వసిస్తున్నా. ప్రపంచ దేశాల నుంచి వలస వచ్చిన ప్రతిభావంతులే ఎన్విడియాను తీర్చిదిద్దారు. వలసదారులు లేకపోతే ఇదంతా సాధ్యమయ్యేది కాదు. సాంకేతిక రంగంలో అమెరికా నాయకత్వం కొనసాగడానికి చట్టబద్ధమైన వలసలు ఇప్పటికీ చాలా అవసరం. అందుకే ఫీజుల పెంపును పట్టించుకోకుండా ప్రపంచవ్యాప్తంగా ప్రతిభావంతులను తీసుకొస్తాం" అని జెన్సన్ హువాంగ్ తన సందేశంలో హామీ ఇచ్చారు. ఈ హెచ్-1బీ ఫీజుల అంశంపై ఎన్విడియా సీఈఓ గతంలోనూ స్పందించిన సంగతి తెలిసిందే. ఈ వీసా రుసుమును లక్ష డాలర్లకు పెంచుతూ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై ట్రంప్ సంతకం చేయడం ఆనందంగా ఉందని హువాంగ్ అన్నారు. ఇది చాలా గొప్ప ఆరంభమని అన్నారు. అయితే, లక్ష డాలర్లు అనేది కాస్త ఎక్కువ మొత్తమేనని తన అభిప్రాయాన్ని వెల్లడించారు. స్టార్టప్‌లు ఈ మొత్తాన్ని భరించలేవన్నారు.

### మస్క్ కంపెనీలో భారీ పెట్టుబడి..

మరోవైపు, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన కంపెనీలో ఎన్విడియా భారీ పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమైంది. చాట్‌జీపీటీకి పోటీగా మస్క్ కృత్రిమ మేధ సంస్థ 'ఎక్స్‌ఏఐ'ను విస్తరించేందుకు పలు దిగ్గజ ఇన్వెస్టర్లు దాదాపు 20 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు పెట్టనున్నారు. ఇందులో ఎన్విడియా కూడా భాగం కానుంది. మస్క్ కంపెనీలో తాము 2 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనున్నట్లు జెన్సన్ హువాంగ్ వెల్లడించారు.

# అవసరమైతే అలాంటి ట్రస్టీలను తొలగించండి

## టాటా గ్రూప్‌నకు కేంద్రం సలహా?




బోర్డు నియామకాల్లో.. పాలనా అంశాల్లో టాటా ట్రస్టీల మధ్య వివాదం ఏర్పడిన సంగతి తెలిసిందే. ఈ సమస్యను సద్దుమణిగించేందుకు కేంద్రం రంగంలోకి దిగింది. టాటా గ్రూప్ ముఖ్యులతో హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా టాటా గ్రూప్‌నకు కేంద్రం కీలక సలహాలు చేసినట్లు తెలుస్తోంది. ఈ వివాదాన్ని అంతర్గతంగా పరిష్కరించుకోవాలని, అవసరమైతే సమస్యకు కారణమయ్యే ట్రస్టీని తొలగించే అంశాన్ని కూడా పరిశీలించాలని కేంద్రం సూచించినట్లు సమాచారం. ఈ మేరకు ఆంగ్ల మీడియా సంస్థ కథనాలు వెల్లడించాయి. టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయెల్ టాటా, వైస్ ఛైర్మన్ వేణు శ్రీనివాసన్, టాటా సన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఛైర్మన్ నటరాజన్ చంద్రశేఖర్, ట్రస్టీ డారియస్‌తో మంగళవారం రాత్రి కేంద్రమంత్రులు అమిత్ షా, నిర్మలా సీతారామన్ భేటీ అయ్యారు. దాదాపు 45 నిమిషాల పాటు ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ట్రస్టీల మధ్య వివాదంపై కేంద్రం ఆందోళన వ్యక్తంచేసినట్లు సదరు కథనాలు వెల్లడించాయి. టాటా ట్రస్ట్స్ బోర్డురూమ్ వివాదం టాటా సన్స్, ఇతర గ్రూప్ కంపెనీల మేనేజ్‌మెంట్‌పై తీవ్ర ప్రభావం చూపించే అవకాశం ఉందని కేంద్రం పేర్కొన్నట్లు సమాచారం. "ఎలాంటి చర్యలు చేపట్టయినా సరే టాటా ట్రస్ట్స్‌లో స్థిరత్వాన్ని పునరుద్ధరించాలి. అంతర్గత వివాదాలు టాటా సన్స్ కార్యకలాపాలను ప్రభావితం చేయకూడదు. ఇందుకోసం నిర్మాణాత్మక చర్యలు తీసుకోవాలి. అవసరమైతే గ్రూప్‌లో అస్థిరతకు కారణమయ్యే ట్రస్టీని తొలగించే అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. టాటా సన్స్‌లో టాటా ట్రస్ట్స్‌ల వాటా ప్రజా బాధ్యతతో వచ్చింది. భారత ఆర్థికవ్యవస్థకు టాటా గ్రూప్ సహకారం చాలా ముఖ్యమైనది. అందువల్ల కంపెనీలో ఎలాంటి వివాదమైనా సరే దాన్ని అంతర్గతంగా, వివేకంతో పరిష్కరించుకోవాలి" అని కేంద్రమంత్రులు టాటా ప్రతినిధులకు సూచించినట్లు సదరు కథనాలు వెల్లడించాయి. ఈ వివాదంతో పాటు అప్పర్ లేయర్ ఎన్ఎఫ్‌బీసీల లిస్టింగ్‌పై ఆర్‌బీఐ మార్గదర్శకాలు, షాపూర్జీ పల్లోంజీకి ద్రవ్య లభ్యత పరిష్కారం గురించి కూడా ఈ భేటీలో చర్చించినట్లు సమాచారం. ఈ సమావేశం తర్వాత టాటా ప్రతినిధులు అంతర్గతంగా చర్చించుకున్నట్లు తెలుస్తోంది. మరోవైపు, టాటా గ్రూప్ ప్రధాన సంస్థ టాటాసన్స్‌లో షాపూర్జీ పల్లోంజీ (ఎస్‌పీ) గ్రూప్ తన వాటాల్లో కొంత విక్రయించుకునేందుకు టాటా ట్రస్ట్స్, టాటా సన్స్ అంగీకరించినట్లు సమాచారం. టాటా సన్స్‌లో టాటా ట్రస్ట్స్‌కు 66శాతం వాటా ఉంది. అయితే, ఈ ట్రస్ట్ బోర్డులో టాటా, షాపూర్జీ పల్లోంజీ వర్గాల ట్రస్టీల మధ్య బేదాభిప్రాయాలు తలెత్తినట్లు వార్తలు వచ్చాయి. సెప్టెంబరు 11న జరిగిన ట్రస్టీల బోర్డు సమావేశంలో రక్షణశాఖ మాజీ కార్యదర్శి విజయ్ సింగ్‌ను టాటా సన్స్ డైరెక్టర్‌గా తొలగించారు. దీనిపై బోర్డురూమ్‌లో విభేదాలు తలెత్తినట్లు సమాచారం.

www.rajamudranews.com
రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక

# విదేశాలకు వెళ్లాలా..?
## ముందు రూ.60కోట్లు కట్టండి



**శిల్పాశెట్టికి బాంబే హైకోర్టు షాక్**


ఓ వ్యాపారవేత్తను రూ.60 కోట్ల మేర మోసం చేసిన కేసులో నటి శిల్పాశెట్టి దంపతులు ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ కేసుకు సంబంధించి విచారణ జరుగుతోంది. మరోవైపు వీరికి ముంబయి పోలీసుల ఆర్థిక నేరాల విభాగం లుకౌట్ నోటీసులు(ఎల్‌వోసీ) జారీ చేసింది. ఈ క్రమంలో శిల్పాశెట్టి దంపతులు విదేశీ పర్యటనకు వెళ్లడానికి అనుమతి కోరుతూ బాంబే హైకోర్టులో పిటిషన్ వేశారు. తాజాగా కోర్టు ఆ పిటిషన్‌ను తిరస్కరించింది. విదేశాలకు వెళ్లేందుకు నటి శిల్పాశెట్టి దంపతులకు అనుమతి నిరాకరించింది. ఒకవేళ దేశం విడిచి వెళ్లాలంటే ముందు రూ.60కోట్లు డిపాజిట్ చేయాల్సిందేనని స్పష్టం చేసింది. ఈ ఆదేశాలను పాటించిన తర్వాత తదుపరి విచారణ కొనసాగుతుందని తెలిపింది. ఓ యూట్యూబ్ ఛానల్ నిర్వహించే కార్యక్రమంలో [illegible]గా శిల్పాశెట్టి అక్టోబరు 25-29 తేదీల మధ్యలో కొలంబో వెళ్లాల్సి ఉంది. లుకౌట్ నోటీసులు ఉన్న నేపథ్యంలో ఆమె కోర్టును ఆశ్రయించారు. 'ఈవెంట్ నిర్వాహకుల నుంచి ఏమైనా ఆహ్వానం ఉందా?' అని కోర్టు శిల్ప లాయర్‌ను ప్రశ్నించగా, ప్రస్తుతం కేవలం ఫోన్‌కాల్ ద్వారా మాత్రమే సమాచారం తెలియజేశారని, కోర్టు అనుమతి ఇస్తే, అధికారికంగా ఆహ్వానం అందుతుందని తెలిపారు.

# కాంతారా మూవీ అద్భుతంగా ఉంది
### కేంద్రమంత్రి కుమారస్వామి కితాబు



కన్నడ నటుడు రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో వచ్చిన కాంతార చాప్టర్ 1 సినిమా చూసిన కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత కేంద్ర మంత్రి హెచ్.డి. కుమారస్వామి ప్రశంసల జల్లు కురిపించారు. కాంతార చిత్రాన్ని తన సతీమణి అనిత కుమారస్వామితో కలిసి న్యూఢిల్లీలో వీక్షించిన కుమారస్వామి.. సినిమా చూసిన అనంతరం ఆయన తన సంతోషాన్ని ఎక్స్ వేదికగా పంచుకున్నారు. ఈ సందర్భంగా కాంతార: చాప్టర్ 1 చిత్రాన్ని అద్భుత కళాఖండంగా అభివర్ణించారు. కాంతార అనేది కన్నడ అస్థిత్వాన్ని గొప్పగా అద్భుతంగా ఆవిష్కరించిన వేడుక. ఇది మన సాంస్కృతిక సారాన్ని హృదయాన్ని హత్తుకునే విధంగా, అత్యంత వాస్తవికంగా చిత్రీకరించింది. ఈ సినిమా తనను విపరీతంగా ఆకట్టుకుందని తెలిపాడు. ఈ సినిమా ఇంతటి విజయం సాధించినందుకు రిషబ్ శెట్టితో పాటు చిత్ర బృందానికి హృదయపూర్వకంగా శుభాకాంక్షలు తెలిపాడు.

# కాంతారా ఎఫెక్ట్ కోసం చాలా కష్టపడ్డాం
### సినిమాటోగ్రాఫర్ అరవింద్ కశ్యప్



ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద మంచి టాక్‌తో ప్రేక్షకులను అలరిస్తున్న చిత్రం కాంతార: చాప్టర్1. రిషబ్‌శెట్టి స్వీయ దర్శకత్వంలో రూపొందిన ఈ మూవీ కథ, కథనాలతోనే కాకుండా, విజువల్స్ పరంగానూ ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా టైగర్ సీక్వెన్స్, యాక్షన్ సన్నివేశాలు, రథంపై యుద్ధం, సహజమైన అడవుల్లో తీర్చిదిద్దిన సన్నివేశాలు సినిమాకు ఫ్రెష్‌లుక్‌ను తీసుకొచ్చాయి. ఈ విజువల్ వండర్ వెనక రిషబ్‌శెట్టి విజన్‌తో పాటు, సినిమాటోగ్రాఫర్ అరవింద్ కశ్యప్ విజన్ కూడా ఉంది. తాజాగా ఈ సినిమా మేకింగ్ వెనక ఉన్న ఆసక్తికర విషయాలను అరవింద్ పంచుకున్నారు. కాంతార: చాప్టర్1 95 శాతం చిత్రీకరణ కర్ణాటకలోని కుందాపురలోనే తీశాం. దాదాపు రెండేళ్ల పాటు చిత్రబృందం అంతా అక్కడే ఉంది. షూటింగ్ జరిగినన్ని రోజులు ఒత్తిడి, నిద్ర లేని రాత్రులు గడిపాం. కానీ, సవాళ్లు స్వీకరించినప్పుడే అసలైన ప్రతిభ బయటపడుతుంది. రోజూ నేను లైట్లతో ప్రయోగాలను చేసేవాడిని. దర్శకుడు అనుకున్నట్లు సీన్ వచ్చేవరకూ ఏ విషయంలోనూ అస్సలు వెనక్కి తగ్గేవాళ్లం కాదు. అటవీ ప్రాంతంలో సరైన లైటింగ్ ఎఫెక్ట్ రావడానికి ఒక్కోసారి వారాల సమయం పట్టేదన్నారు. ఈ మూవీలో ప్రేక్షకులను విశేషంగా అలరించింది టైగర్ సీక్వెన్స్. ముఖ్యంగా పిల్లాడి చుట్టూ పులి తిరుగుతుంటే తెరపై ఆ సన్నివేశాన్ని చూసే ప్రేక్షకుడి ఒళ్లు గగుర్పొడిచింది. పులికి సంబంధించిన అన్ని సన్నివేశాలను షూటింగ్ మొదలుపెట్టిన సంవత్సరంలోనే తీసేశాం. నిజంగా పులి నడుచుకుంటూ వస్తే, ఎక్కడెక్కడ నీడ పడుతుంది బిడ్డ చుట్టూ ఉన్న ఆకులు, ఆ వాతావరణం ఎలా కనపడాలి ఇలా అన్నింటినీ పరిగణనలోకి తీసుకొని, ఆ సీన్‌ను తీశాం. రిషబ్‌లో ఉత్సాహం అనంతం. అతడు నటిస్తుంటే, మొత్తం సెట్ దాన్ని ఫీలయ్యేది. ముఖ్యంగా గులిగా కనిపించే ఎమోషనల్ సీన్స్ ఒకట్రెండు టేక్స్‌లోనే ఓకే చేయాలి. లేకపోతే, అన్నిసార్లు ఆ స్థాయి భావోద్వేగాలు రావని అన్నారు. యువరాణి కనకవతి గుర్రంపై వచ్చే సన్నివేశం తెరకెక్కించడం మాకు కాస్త కష్టమనిపించింది. ఆ లొకేషన్ అడవిలో చాలా దూరం. కొత్తపుర నుంచి దాదాపు గంటన్నర పాటు ప్రయాణం చేయాల్సివచ్చేది. మరో అరగంట నడుచుకుంటూ వెళ్లాలి. ఆ తర్వాత 45 నిమిషాల పాటు ఒక కొండను ఎక్కి దిగాల్సి వచ్చేది. కేవలం మూడు నిమిషాల నిడివి గల సీన్‌కు నాలుగు రోజులు షూట్ చేశాం. ఇక వాతావరణం కూడా చాలాసార్లు ఇబ్బందిపెట్టేది. ఈ విషయంలో ప్రొడక్షన్ టీమ్‌కు హ్యాట్సాఫ్ చెప్పాల్సిందే. వర్షం మొదలైన నిమిషాల్లోనే అంతా క్లియర్ చేసేవాళ్లు. ఒకసారి భారీ వర్షం కారణంగా మేము నిర్మించిన బ్రిడ్జ్ కూడా కొట్టుకుపోయింది. దీంతో వారం పాటు అడవిలోనే ఉండాల్సివచ్చింది. ఇలా మొత్తం 200 రోజులు షూటింగ్ చేశాం అని అరవింద్ కశ్యప్ చెప్పుకొచ్చారు.



# మాస్ జాతర నుంచి మరో పాట

రవితేజ హీరోగా శ్రీలీల హీరోయిన్‌గా కొత్త దర్శకుడు భాను భోగవరపు తెరకెక్కించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ మాస్ జాతర. అక్టోబర్ 31న రిలీజ్ కానుంది. ఈనేపథ్యంలో హుడియో హుడియో పాటను విడుదల చేయనున్నారు. చిట్టి చిలకా.. చిన్న మొలకా..అంటూ సాగే లిరిక్స్‌ను దేవ్ రాయగా అబ్దుల్ వహాబ్, భీమ్స్ సిసిరోలియో ఆలపించారు. ఇటీవల ఇందులోని ఓలే ఓలే లిరికల్ సాంగ్‌ను రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. అయితే, ఈ పాట లిరిక్స్‌లో అసభ్య పదాలు ఉన్నాయిని విమర్శలు వచ్చాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో రవితేజ, దర్శకుడు ఈ విమర్శలపై స్పందించారు. కొన్నిటిపై బోల్డ్ మూవీలు అనే ముద్ర వేస్తారు. అలాంటి వాటితో ఎవరికీ ఇబ్బంది రాదు. కానీ, వారికి నా సినిమాతో మాత్రమే సమస్య వచ్చింది. మా గ్రామాల్లో స్థానికంగా జరిగే ఉత్సవాల్లో కొంతమంది చిన్న చిన్న కథలను పాటలుగా చెబుతుంటారు. వాళ్లు తిట్టుకున్నట్లు అనిపిస్తుంది కానీ, వాస్తవానికి వాళ్లు చాలా ప్రేమగా మాట్లాడుకుంటారని దర్శకుడు భాను అన్నారు. విమర్శలు చేసేవారు కేవలం పాటలోని కొన్ని పదాలను మాత్రమే చూస్తున్నారు. తర్వాత వచ్చే సరదా సంభాషణలను చూడడం లేదు. సినిమా చూశాక ఈ పాట వెనక ఉన్న అసలు కథ మీకు అర్థమవుతుంది. ప్రేక్షకులకు అందరికీ ఈ పాట నచ్చుతుంది. అయినా ఇప్పుడు ఇంగ్లిష్‌లో కొన్ని పదాలు సాధారణం అయిపోయాయి. వాటిని తెలుగులో చెప్పినప్పుడే కొందరికి సమస్య వస్తుందని రవితేజ చెప్పారు. ఇక ఈ పాట సినిమాలో సన్నివేశానికి సరిగ్గా సరిపోతుందని శ్రీలీల అన్నారు.

# ఓటిటిలోకి వార్2 ఎంటర్

బాలీవుడ్ నటుడు హృతిక్ రోషన్, టాలీవుడ్ స్టార్ నటుడు ఎన్టీఆర్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం వార్. కియారా అద్వానీ ఈ సినిమాలో కథానాయికగా నటించగా.. అనిల్ కపూర్, అశుతోష్ రాణా, అలియాభట్, బాబీ దేవోల్, శర్వారీ వాఘ్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఈ సినిమాకు అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించగా.. యష్‌రాజ్ ఫిలిమ్స్ బ్యానర్‌పై ఆదిత్య చోప్రా నిర్మించాడు. ఈ చిత్రం ఇండెపెండెన్స్ కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చి మిక్స్‌డ్ టాక్ తెచ్చుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమా ఓటీటీలోకి రాబోతుంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో ఈ చిత్రం అక్టోబర్ 9 నుంచి స్ట్రీమింగ్ కాబోతున్నట్లు ప్రకటించింది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ఇండియన్ రా ఏజెన్సీలో ప్రముఖుడైన ఏజెంట్ కబీర్(హృతిక్) కిరాయి హంతకుడిగా మారి హత్యలు చేస్తుంటాడు. ఇదిలావుంటే.. చైనా, రష్యా, శ్రీలంక, మయన్మార్, బంగ్లాదేశ్ దేశాలన్నీ ఒక కోటరీగా మారి, కలి పేరుతో ఇండియా పతానానికి ఎ÷లాన్ చేస్తాయి. ఈ మిషన్‌ని కబీర్‌కు అప్పజెబుతాయి. కబీర్‌ను అడ్డుకునేందుకు విక్రమ్ చలపతి (జూనియర్ ఎన్టీఆర్) రంగంలోకి దిగుతాడు. అసలు కబీర్‌కీ, విక్రమ్‌కు మధ్య ఉన్న బంధం ఏంటి కలి వల్ల భారత ప్రధానికి పొంచివున్న ముప్పును వీరిద్దరూ ఎలా ఆపారు ఈ మిషన్‌లో వింగ్ కమాండర్ కావ్య లూత్ర(కియారా అద్వానీ) పాత్ర ఏంటి ఈ ప్రశ్నలకు సమాధానమే మిగతా కథ.



# లోక సినిమాతో హిట్ సాధించిన కళ్యాణి



లోక సినిమాతో రూటు మార్చేసింది కళ్యాణి ప్రియదర్శన్. ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద బిగ్గెస్ట్ హిట్‌గా నిలువడమే కాదు.. నిర్మాతలకు కాసుల వర్షం కురిపించింది. అత్యధిక గ్రాస్ సాధించిన సౌతిండియన్ ఫీమేల్ సెంట్రిక్ మూవీగా నిలిచింది. మాలీవుడ్ లో గత రికార్డులు బీట్ చేసి టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలిచింది. కళ్యాణి ప్రియదర్శన్ మళ్లీ గ్లామరస్ అవతార్‌లోకి మారిపోయింది. ఎవరూ ఊహించని విధంగా సూపర్ గ్లామర్ రోల్‌లో దర్శనమిచ్చింది కళ్యాణి ప్రియదర్శన్. ఈ భామ కమర్షియల్ సినిమా హీరోయిన్‌గా ట్రాన్స్‌ఫార్మేషన్ అయిన తీరుకు షాక్ అవుతున్న ఫాలోవర్లు, నెటిజన్లు.. ఈ సాంగ్‌లో వేసిన స్టెప్పులకు ఫిదా అవుతున్నారు. గ్లామరస్ పాత్ర గురించి కళ్యాణి ప్రియదర్శన్ మాట్లాడుతూ.. ఓ యాక్టర్‌గా నేను ఇదివరకెన్నడూ చేయని పాత్రలను చేయాలని నాకు నేను చాలెంజింగ్‌గా తీసుకుంటా. ఈ పాటలో అలాంటి కొన్ని మూమెంట్స్ ఉన్నాయి. నా డైరెక్టర్ భువనేశ్ ఈ విషయం గురించి నాకు చెప్పినప్పుడు.. అతడు ఉ।నితి। కథకు చాలా ముఖ్యమైన అందమైన కమర్షియల్ మ్యూజికల్ పీస్‌ను అద్భుతంగా ఎలా తీశాడోనని అనిపించింది. దీనివెనుకున్న కారణాలు చాలా శక్తివంతమైనవి. ఏదైనా కొత్తగా చేయాలని.. చాలా బాగా కష్టపడటం జరిగింది. మీరంతా ఈ పాటను ఇష్టపడతారని ఆశిస్తున్నానని చెప్పుకొచ్చింది.

# మళ్లీ అవకాశాలు పట్టుకుంటున్న పూజా



ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో ఉన్న మోస్ట్ టాలెంటెడ్ భామల్లో టాప్‌లో ఉంటుంది పూజాహెగ్డే. తమిళం, హిందీ, తెలుగు భాషల్లో టాప్ స్టార్లతో కలిసి నటించి వన్ ఆఫ్ ది లీడింగ్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగింది. ఈ పొడుగు కాళ్ల సుందరికి తెలుగులో హిట్ పడక చాలా కాలమే అవుతుంది. తెలుగులో కూడా బ్యాక్ టు బ్యాక్ హిట్స్ అందుకుంటున్న మాలీవుడ్ స్టార్ యాక్టర్ దుల్కర్ సల్మాన్. ఈ లీడింగ్ హీరో రవి నెలకుడిటి దర్శకత్వంలో ఓ తెలుగు సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడని తెలిసిందే. ప్రస్తుతం హైదరాబాద్‌లో జెట్ స్పీడ్‌లో షూటింగ్ కొనసాగుతోంది. ఈ సినిమాతో లాంగ్ గ్యాప్ తర్వాత పూజా హెగ్డే మళ్లీ తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. తాజా కథనాల ప్రకారం ఈ సినిమా కోసం పూజా హెగ్డే ఏకంగా రూ.3 కోట్లు పారితోషికం తీసుకుంటుందని టాక్. అయితే రెమ్యునరేషన్ భారీగా డిమాండ్ చేస్తున్న కారణంగా పూజాహెగ్డే తెలుగు సినిమాలకు దూరమైందని కొన్ని రోజుల క్రితం వార్తలు చక్కర్లు కొట్టాయి. కానీ దుల్కర్ సల్మాన్ టీంకు ఈ విషయంలో ఎలాంటి అభ్యంతరాలు లేకపోవడంతో పూజా హెగ్డేను తమ టీంలోకి తీసుకుందట. ఇక ఈ పుకార్లకు ఫుల్ స్టాప్ పెడుతూ తెలుగులో దుల్కర్ సల్మాన్ సినిమాతో మళ్లీ ఫాంలోకి రావాలని చూస్తున్నట్టు అర్థమవుతుంది. ఇటీవలే రజినీకాంత్ నటించిన కూలీ సినిమాలో మోనికా సాంగ్‌లో మెరిసింది పూజా హెగ్డే. ఈ పాటలో అందాలు ఆరబోస్తూ కుర్రకారుకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. కూలీ సాంగ్ భారీ హిట్ అయింది. ఇక దుల్కర్ సల్మాన్ సినిమా బ్లాక్ బస్టర్ అయితే పూజాహెగ్డేకు తెలుగులో మళ్లీ మంచి రోజులు వచ్చినట్టేనని చెప్పొచ్చు.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, Printed at **KAKATHIYA PRINTERS**, LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com